# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం






సంపుటి: 01 | సంచిక: 339 | హైదరాబాద్ | మంగళవారం | 27-05-2025 | పేజీలు: 08


## ఆ 20 మంది ఎక్కడ?

సమీర్ ఇంట్లో సమావేశమైన కుర్రాళ్లెవరు?

శిక్షణ పొందిన వారంతా ఉగ్రవాదులేనా?

వరంగల్ ఫర్హాన్, యూపీ బాదర్ ఎక్కడ?

రాష్ట్ర ఇంటెలిజెన్స్‌ను తొలిచేస్తున్న ప్రశ్నలు

ఉగ్ర కుట్రలో వీరంతా భాగస్వాములేనా?

ఉగ్ర కుట్రలపై నిఘా పెట్టలేని ఇంటెలిజెన్స్!

ఆ స్లీపర్‌సెల్స్ గుట్టు కనిపెట్టేందుకు తంటాలు



3

## ముందే పలకరించిన తొలకరి..

# ఎరువుల్లేవ్.. విత్తనాల్లేవ్

కావాల్సిన యూరియా 4 లక్షల టన్నులు

అందుబాటులో ఉన్నది 1.7 లక్షల టన్నులే

అవసరమైన 2.4 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లకు


సిద్ధంగా ఉన్నవి 40 లక్షల ప్యాకెట్లే

పచ్చిరొట్ట విత్తనాలదీ అదే పరిస్థితి

సీజన్ ముందుకు రావడంతో

విత్తనాలు, ఎరువుల కోసం

రైతుల ఎదురుచూపులు



2



ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..

03

కేబినెట్ కూర్పు చేయాలని రాహుల్ గాంధీని కోరాం..



2

## కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కేసీఆర్ అన్నారు..

విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లన్నీ కాంగ్రెస్ పార్టీ హయంలోనివే..

మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా.. ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం..

కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కేసీఆర్ అన్నారు: డిప్యూటీ సీఎం భట్టి



3



2

## పాక్ ద్వేషంతో బతుకుతోంది..

నుదిట సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం

గుజరాత్‌లోని భుజ్‌లో జరిగిన ర్యాలీలో మోడీ వ్యాఖ్య

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ..

### ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్ల నియామకం..

ట్రాన్స్ జెండర్లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశం..

ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నిధులు నిర్వహిస్తున్న ట్రాన్స్ జెండర్లు సత్తా చాటుతున్నారు..



2

## మోడీ పదేళ్లు ప్రధానిగా ఉన్నా.. బీసీలకు మాత్రం మేలు చేయడం లేదు

కాంగ్రెస్ ఒత్తిడితోనే కేంద్రం కులగణన చేయబోతుంది..

త్వరలోనే రాహుల్ గాంధీకి ధన్యవాద సభ ఏర్పాటు చేస్తాం..



2

## మనోడు ఎవడో... వెన్నుపోటు పొడిచేదెవరో తెలిసింది

మన పార్టీ నుంచి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలను ఉప ఎన్నికల్లో ఓడించాలి..

ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం హామీ..

సీఎం మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి మీద అనుమానం కలుగుతుంది: కేటీఆర్



3

## కేంద్రం, రాష్ట్రం దొందూ దొందే..

### ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీపై నిర్లక్ష్యం

ఏడాదైనా పురోగతి శూన్యం

భూములున్నా పట్టింపులేదు

ప్రాజెక్టు పూర్తయితే 1.74 లక్షల ఉద్యోగాలు




2

## చంద్రబాబు చేతిలో సీఎం రేవంత్ ఓ కీలుబొమ్మ..

సూర్యాపేట జిల్లాలో తడిసిన ధాన్యం రాశులని పరిశీలించిన జగదీష్ రెడ్డి..

బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాలను సమర్థవంతంగా వాడుకున్నాం..

ప్రధాని సహకారంతో చంద్రబాబు కృష్ణా జలాలను తరలించుకుపోతున్నారు



3

# కేంద్రం, రాష్ట్రం దొందూ దొందే..

## ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీపై నిర్లక్ష్యం

- ఏడాదైనా పురోగతి శూన్యం
- భూములున్నా పట్టింపులేదు
- ప్రాజెక్టు పూర్తయితే 1.74 లక్షల ఉద్యోగాలు

**హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర పారిశ్రామిక రంగం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి దొందూ దొందే అన్నట్టుగా తయారైంది. ఎవరికివారు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో తెలంగాణలో పారిశ్రామికరంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. నిధుల లేమితో రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామికవాడల ఏర్పాటును పూర్తిగా విస్మరించగా.. కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ వ్యవహారమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. తయారీ రంగంలో దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్‌ఐసీడీపీ)ను చేపట్టింది.

ఇందులో భాగంగా వివిధ ఇండస్ట్రియల్ కారిడార్ల పరిధిలో ఉండే నగరాలను దశలవారీగా ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో నిరుడు ఆగస్టులో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలను మంజూరు చేశారు. ఆ జాబితాలో జహీరాబాద్‌కు చోటు కల్పించారు. దీంతో కేంద్రం ఇప్పటివరకు మొత్తం 20 ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలను మంజూరు చేసినట్టయింది. వాటిలో ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (గుజరాత్), ఔరంగాబాద్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ లిమిటెడ్ (మహారాష్ట్ర), గ్రేటర్ నోయిడా ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ (ఉత్తరప్రదేశ్), విక్రమ్ ఉద్యోగ్‌పురి ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ (మధ్యప్రదేశ్) ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ 4 గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలు 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల సామర్థ్యాన్ని కలిగివున్నాయి.

**1.74 లక్షల ఉద్యోగాలు వచ్చే ప్రాజెక్టుపై నిర్లక్ష్యం**

రాష్ట్ర ప్రభుత్వం భూములను సమకూర్చితే స్మార్ట్‌సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. తద్వారా నివాస ప్రాంతాలు, కంపెనీల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదు. హైదరాబాద్‌నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా మం జూరైన జహీరాబాద్ స్మార్ట్‌సిటీని మొదటి దశలో రూ.2,361 కోట్లతో 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తద్వారా రూ.10 వేల కోట్ల పెట్టుబడులతోపాటు




1,74,000 ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఆటోమొబైల్, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్‌తోపాటు మెటల్స్, నాన్‌మెటాలిక్ మినరల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర పరిశ్రమలకు అనువుగా ఉండేలా జహీరాబాద్ స్మార్ట్‌సిటీని సిద్ధం చేయాలని నిర్ణయించారు.

**కేసీఆర్ హయాంలోనే 8 వేల ఎకరాల సేకరణ**

నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌జహీరాబాద్ (నిమ్జ్) కోసం జహీరాబాద్, న్యాలకల్, జరాసంఘం మండలాల పరిధిలో 13,500 ఎకరాలు సేకరించాలని నిర్ణయించగా.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దాదాపు 8 వేల ఎకరాల భూసేకరణ పూర్తయింది. దీనికి పర్యావరణ అనుమతులు కూడా లభ్యమయ్యాయి. కోర్టు కేసుల వల్ల కొన్నిచోట్ల భూసేకరణలో ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వాటిని పరిష్కరించాల్సి ఉన్నది. కాగా, స్మార్ట్‌సిటీకి అవసరమైన 3,000 ఎకరాలకుపైగా భూములు ఇప్పటికే సిద్ధంగా ఉన్నట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి.

ప్రస్తుతం కేంద్రం మంజూరు చేసిన ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ కూడా ఈ ప్రాంతంలోనే ఉన్నది. సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్, జరాసంఘం మండలాల్లోని 17 గ్రామాల్లో ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీని నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టును మొత్తం రెండు దశల్లో 12,500 ఎకరాలకు విస్తరించాలన్న ప్రతిపాదనలున్నాయి. ఎన్‌ఐసీడీఐటీ ఫ్రేమ్‌వర్‌లో భాగంగా మొదటి దశలో 3,245 ఎకరాల్లో పనులు ప్రారంభించాల్సి ఉన్నది. అన్ని అనుకూలతలు, భూములు సిద్ధంగా ఉన్నా, కంపెనీల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాజెక్టు ముందుకు సాగడంలేదు.

## మోడీ పదేళ్లు ప్రధానిగా ఉన్నా.. బీసీలకు మాత్రం మేలు చేయడం లేదు

- కాంగ్రెస్ ఒత్తిడితోనే కేంద్రం కులగణన చేయబోతుంది..
- త్వరలోనే రాహుల్ గాంధీకి ధన్యవాద సభ ఏర్పాటు చేస్తాం..
- మోడీ పదేళ్లు ప్రధానిగా ఉన్నా.. బీసీలకు మాత్రం మేలు చేయడం లేదు: వి. హన్మంతరావు

**హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ ఒత్తిడి వల్లే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడానికి హస్తం పార్టీ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే, ఇవాళ ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లో ఓబీసీ ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశం ముగిసిన తర్వాత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హన్మంతరావు మాట్లాడుతూ.. త్వరలోనే రాహుల్ గాంధీకి ధన్యవాద సభ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. భారత జోడో యాత్రలో రాహుల్ గాంధీ కీలక నిర్ణయం ప్రకటించాడు.. అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని అప్పుడే వెల్లడించారు.. అందులో భాగంగానే.. దేశంలోనే మొట్ట మొదట తెలంగాణలో కులగణన చేశామని వి. హన్మంతరావు తెలిపారు.

ఇక, రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతాయని మాజీ ఎంపీ వి. హన్మంతరావు పేర్కొన్నారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో.. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి బీసీ నేతలను పిలిచి సమావేశం నిర్వహించారు.. అయితే, మోడీ పదేళ్లు ప్రధానిగా ఉన్నా.. బీసీలకు మాత్రం మేలు చేయడం లేదు అని ఆరోపించారు. ఓబీసీ ఎంపీల కన్వీనర్ గా మూడు సార్లు ప్రధానిని కలిశాను.. కులగణన చెయ్యాలని కోరాను.. కానీ, ఇప్పటి వరకు చేయలేదు.. త్వరలోనే కులగణన చేస్తామని చెప్పారని వీహెచ్ వెల్లడించారు.



## దేశానికే ఆదర్శంగా తెలంగాణ
### ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్ల నియామకం..

- ట్రాన్స్ జెండర్లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశం..
- ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నిధులు నిర్వహిస్తున్న ట్రాన్స్ జెండర్లు సత్తా చాటుతున్నారు..

**హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):**

సచివాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాన్స్ జెండర్లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. ఈ మీటింగ్ కు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరు అయ్యారు. గత ఆరు నెలల క్రితం ప్రయోగాత్మకంగా 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. దేశంలో మొట్ట మొదటిసారిగా ట్రాఫిక్ అసిస్టెంట్గా ట్రాన్స్ జెండర్లను తీసుకుంది. కేవలం పది రోజుల్లోనే ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్ను నియమించి తెలంగాణ సర్కార్ రికార్డు సృష్టించింది.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ట్రాన్స్ జెండర్లు అంటే సమాజంలో చిన్న చూపు ఉందన్నారు. కానీ దాన్ని అధిగమించి ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లు తమ సత్తాను చాటారు.. ట్రాన్స్ జెండర్లకు అవకాశాలు కల్పిస్తే రాణిస్తామని ట్రాఫిక్ అసిస్టెంట్లు నిరూపించారు.. గత ఆరు నెలల్లో సకాలంలో విధులకు హాజరై తమ అంకిత భావాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఎంతో క్లిష్టమైన ట్రాఫిక్ డ్యూటీని క్రమ శిక్షణతో వహిస్తున్నారు.. ప్రతి ఒక్కరిలో సమర్థత ఉంటుందని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ట్రాన్స్ జెండర్లు గొప్ప ఉదాహరణగా నిలుస్తున్నారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లను నియమించాం.. ఈ విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ లోని ఉదయపూర్ లో నిర్వహించిన చింతన్ శివిర్ లో నేను ప్రత్యేకంగా ప్రస్తావించాను అని మంత్రి సీతక్క వెల్లడించారు.





# ముందే పలకరించిన తొలకరి.. ఎరువుల్లేవ్.. విత్తనాల్లేవ్

- కావాల్సిన యూరియా 4 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నది 1.7 లక్షల టన్నులే
- అవసరమైన 2.4 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లకు సిద్ధంగా ఉన్నవి 40 లక్షల ప్యాకెట్లే
- పచ్చిరొట్ట విత్తనాలదీ అదే పరిస్థితి
- సీజన్ ముందుకు రావడంతో విత్తనాలు, ఎరువుల కోసం రైతుల ఎదురుచూపులు

**హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):**

తొలకరి చినుకు ముందే పలకరించడంతో రైతులు వ్యవసాయ పనులు మొదలుపెడుతున్నారు. అయితే, ఈ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడంలో వ్యవసాయ శాఖ విఫలమైందనే విమర్శలొస్తున్నాయి. రాష్ట్ర అవసరాలకు తగినంత స్థాయిలో ఎరువులు, విత్తనాలు ప్రస్తుతానికి అందుబాటులో లేవని తెలుస్తున్నది. ముఖ్యంగా యూరియా, పత్తి విత్తనాల కొరత ఏర్పడే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాఖ అధికారులే ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ వానకాలంలో 1.34 కోట్ల ఎకరాల్లో పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. ఇందులో అత్యధికంగా 66.8 లక్షల ఎకరాల్లో వరి, 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 50 లక్షల ఎకరాల్లో పత్తి, 9 లక్షల ఎకరాల్లో సోయా పంటలు సాగవుతాయని అంచనా వేసింది.

**యూరియా కొరత తప్పదా?**

ఈ సీజన్‌కు 9.8 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా. అయితే ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు, ప్రభుత్వం వద్ద కలిపి 3.17 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నట్టు తెలిసింది. రైతులు ఎక్కువగా యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) మీద ఆధారపడతారు. ప్యాక్స్‌కు యూరియాను సరఫరా చేసే మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలు అడుగంటినట్టు తెలిసింది. సీజన్‌కు ముందే మార్క్‌ఫెడ్ వద్ద సుమారు 4లక్షల టన్నుల బఫర్ స్టాక్ ఉండాలి. కానీ, శనివారం నాటికి 1.72 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నది.

ఉండాల్సిన దాని కన్నా 2.28లక్షల టన్నులు తక్కువగా ఉన్నది. ఈ కొరతకు తోడు కేంద్రం నుంచి రావాల్సిన యూరియా రావడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలకు కలిపి 3.3 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి రావాల్సి ఉండగా 1.72లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. అంటే 1.58 లక్షల టన్నులు తక్కువగా వచ్చింది. ఈ విధంగా మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ నిల్వలు తక్కువగా ఉండి, కేంద్రం నుంచి రావాల్సిన యూరియా రాకపోవడంతో రాష్ట్రంలో యూరియా కొరత తప్పదనే ఆందోళన వ్యవసాయ శాఖ అధికారుల్లో వ్యక్తమవుతున్నది. ఈ ప్రభావం సాగుపై పడుతుందని, రైతులకు ఇబ్బంది తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**విత్తనాలకూ కొరతే**

ఎరువులతోపాటు విత్తనాలకు కూడా కొ రత తప్పేలా కనిపించడం లేదు. ముఖ్యంగా గత సంవత్సరం మాదిరిగానే పత్తి, పచ్చిరొట్ట విత్తనాలకు తిప్పలు తప్పేలా లేవు. ఈ సీజన్‌లో 50లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం కనీసం కోటిన్నర పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం. అయితే వ్యవసాయ శాఖ మాత్రం 2.4 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందించింది. కానీ, ప్రస్తుతం 40 లక్షల విత్తన ప్యాకెట్లు మాత్రమే క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీనికితోడు పచ్చిరొట్ట విత్తనాల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

ప్రభుత్వం 1.94 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తే.. విత్తనాభివృద్ధి సంస్థ 97 వేల టన్నులకు మా త్రమే ప్రణాళిక రూపొందించింది. ఇందులో ప్రస్తుతం సగం విత్తనాలే క్షేత్రస్థాయికి చేరినట్టు తెలిసింది. పలు జిల్లాల్లో రైతుకు పచ్చిరొట్ట విత్తనాలు ఒక్క సంచి మాత్రమే ఇస్తున్నట్టు సమాచారం. అది కూడా క్యూలైన్లలో నిలబడితే గానీ లభించడం లేదని చెప్తున్నారు.






**ముందుకొచ్చిన సీజన్**

గతంతో పోల్చితే ఈ ఏడాది సీజన్ చాలా ముందుకొచ్చింది. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే రుతుపవనాలు ఇప్పటికే వచ్చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా తొలకరి జల్లులు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. అధికారులు మాత్రం మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేగంగా కదలడం లేదు. జూన్ ప్రణాళిక ప్రకారమే పనిచేస్తున్నారు. ఇప్పుడు సీజన్ సుమారు 20 రోజులు ముందుకు రావడంతో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## పాక్ ద్వేషంతో బతుకుతోంది..

- నుదిట సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం
- గుజరాత్‌లోని భుజ్‌లో జరిగిన ర్యాలీలో మోడీ వ్యాఖ్య

**గుజరాత్, మే 26(ప్రజాక్షేత్రం):**

మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచిపెట్టిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. గుజరాత్‌లోని భుజ్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా మరొకసారి పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సిందూర్ అనేది వివాహానికి సంకేతమని.. దానిని తుడిచివేయడం అంటే వైధవ్యాన్ని సూచిస్తుందన్నారు. మన సోదరీమణుల నుదిట నుంచి దాన్ని తుడిచేసే ధైర్యం చేసిన వాళ్లను ఖతం చేశామని చెప్పారు. ఇక మోడీని ఢీకొట్టడం ఎంత కష్టమో ఉగ్రవాదులు కూడా కలలో ఊహించి ఉండకపోవచ్చన్నారు. మన త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని.. దీంతో ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచం చూడని విధంగా అద్భుతాలు సృష్టించారని ప్రశంసించారు.

భారతదేశం పట్ల దాయాది దేశం పట్ల ద్వేషం కక్కుతోందని.. భారత్‌కు హాని చేయాలనే పాకిస్థాన్ కోరుకుంటోందని తెలిపారు. భారత్ లక్ష్యం పేదరిక



నిర్మూలన, ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం, అభివృద్ధిని చెందిన దేశంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. ఇక వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధిని తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని చెప్పారు. హోలీ, దీపావళి, గణేష్ పూజ వంటి పండుగల సమయంలో భారతదేశంలో తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేసి ఉపయోగించాలని ప్రజలను మోడీ కోరారు. విదేశీ దిగుమతులను కొనుగోలు చేయడం మంచిది కాదని చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వదేశంలో తయారైన వస్తువులనే కొనుగోలు చేసేందుకు సంకల్పించుకోవాలని కోరారు.

## కేబినెట్ కూర్పు చేయాలని రాహుల్ గాంధీని కోరాం..

- కేబినెట్ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పాం..
- ఒకట్రెండు రోజుల్లో పీసీసీ కమిటీల ప్రకటన ఉంటుంది: మహేష్ గౌడ్

**హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):**

దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓబీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. సోమవారంసాయంత్రం కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిశారు.

ఇక, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశాను అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని అంశాలపై రాహుల్ కి వివరించాను.. అలాగే, వీలైనంత త్వరగా రాష్ట్ర కేబినెట్ కూర్పు చేయాలని మనవి చేశాను.. త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.. మంత్రి వర్గ విస్తరణతో పాటు త్వరలోనే పీసీసీ కమిటీల ప్రకటన ఉంటుంది అన్నారు.

అయితే, రాష్ట్ర కేబినెట్ విస్తరణ విషయంలో అధిష్టానానికి మేం మా వర్షన్ చెప్పామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మంత్రి వర్గ విస్తరణలో బీసీలకు ప్రాతినిధ్యం ఉండాలని కోరుతున్నాం.. రాష్ట్రానికి సంబంధించిన అన్ని అంశాలు.. కేసి వేణుగోపాల్ పార్టీ అధిష్టాన పెద్దలతో మాట్లాడుతున్నారు.. ఒకట్రెండు రోజుల్లో పీసీసీ కార్యవర్గ ప్రకటన ఉంటుంది అని మహేష్‌గౌడ్ వెల్లడించారు.



# ఆ 20 మంది ఎక్కడ?



- సమీర్ ఇంట్లో సమావేశమైన కుర్రాళ్లెవరు?
- శిక్షణ పొందిన వారంతా ఉగ్రవాదులేనా?
- వరంగల్ ఫర్హాన్, యూపీ బాదర్ ఎక్కడ?
- రాష్ట్ర ఇంటెలిజెన్స్‌ను తొలిచేస్తున్న ప్రశ్నలు
- ఉగ్ర కుట్రలో వీరంతా భాగస్వాములేనా?
- ఉగ్ర కుట్రలపై నిఘా పెట్టలేని ఇంటెలిజెన్స్!
- ఆ స్లీపర్‌సెల్స్ గుట్టు కనిపెట్టేందుకు తంటాలు

హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 20 మందికి పైగా మానవబాంబులుగా తయారయ్యేందుకు సిరాజ్, సమీర్ శిక్షణ ఇచ్చినట్టు తెలిసింది. విజయనగరం ఉగ్ర కుట్రకేసులో కీలకంగా ఉన్న సిరాజ్, సమీర్ ఈ విషయాన్ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణలో తెలిపినట్టు సమాచారం. ఇప్పుడు ఆ 20 మంది ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? వారు నిజంగా మానవబాంబులేనా? అన్న నిగూఢమైన విషయాలను పోలీసులు, దర్యాప్తు సంస్థలు తేల్చాల్సి ఉన్నది. ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన పలువురు స్లీపర్ సెల్స్ వీరితో జత కలిసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సికింద్రాబాద్ బోయగూడలోని రైల్ కళారంగ్ బస్తీకి చెందిన సయ్యద్ సమీర్‌కు ఉగ్ర లింకులు ఉంటడమే ఇందుకు కారణం. ఒకవైపు లిఫ్టు మెకానిక్‌గా పనిచేస్తున్న సమీర్.. కొందరు యువకులతో నిత్యం సమావేశమైనట్టు స్థానికులు చెప్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన పలువురు యువకులతో తన ఇంట్లోనే నిత్యం సమావేశాలు నిర్వహించేవాడని బస్తీవాసులు అంటున్నారు. దీంతో వారంతా ఎవరు? సిరాజ్, సమీర్ చెప్పిన ఆ 20 మంది మానవబాంబులు వాళ్లేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సిరాజ్ చెప్పినట్టు వారే మావనబాంబులైతే.. తెలంగాణలో హైఅలర్ట్ ప్రకటించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఐపీఎల్ మ్యాచులు రద్దు చేశారనే వాదనా వినిపిస్తున్నది.

**హైదరాబాద్‌లోనే పేలుళ్లకు కుట్రలు?**

సిరాజ్ రెహ్మాన్, సయ్యద్ సమీర్ ఢిల్లీ, బెంగళూరు, ముంబై, విజయనగరం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో బాంబు పేలుళ్ల కోసం ఇప్పటికే ప్రాంతాలను ఎంచుకున్నట్టు శనివారం నాటి విచారణలో తేలింది. వారి ప్రధాన లక్ష్యం హైదరాబాద్‌గానే ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్ కేంద్రంగానే వీళ్లు బాంబులు తయారు చేయడం, వాటి సామగ్రిని హైదరాబాద్ నుంచే ఆర్డర్ పెట్టడం వంటివి అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ కేసులో సమీర్ వాంగ్మూలం కీలకం కానున్నట్టు దర్యాప్తు సంస్థ అధికారులు భావిస్తున్నారు.

సమీర్ ఇన్‌స్టాగ్రామ్ గ్రూప్ ద్వారా ఇటు నిందితులకు, సౌదీ నుంచి ఆపరేట్ చేస్తున్న హ్యాండ్లర్లకు టచ్‌లో ఉన్నాడు. హైదరాబాద్ కేంద్రంగా పలువురికి సహాయం అందించడం, వారికి షెల్టర్ ఇవ్వడం, బాంబుల తయారీలో సిరాజ్‌కు సహకరించడం వంటి కీలక పనులను సమీర్ చేశాడు. దీంతో సమీర్ ఇంకా ఎవరెవరితో కాంటాక్ట్‌లో ఉన్నాడు? ఎవరెవరిని కలిసేవాడు? అనే విషయాలపై తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు కూపీ లాగుతున్నారు.

**ఫర్హాన్, బాదర్ ఎక్కడ?**

మొదటి నుంచి వరంగల్‌కు చెందిన ఫర్హాన్ మొయినుద్దీన్, యూపీకి చెందిన బాదర్ ఎక్కడ? అనే కోణంలో ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఉగ్ర కుట్రల కేసులో సిరాజ్, సమీర్ అరెస్టు అయ్యారని తెలుసుకొన్న వీరిద్దరూ పరారీలో ఉన్నారు. వీరిద్దరూ దొరికితే కానీ, విదేశీ లింకులు కూడా బయటపడే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. ఇప్పటికే సిరాజ్, సమీర్‌తోపాటు బాదర్, ఫర్హాన్ కుటుంబసభ్యులు, వారి బంధు, మిత్రుల కదలికలపై నిఘా పెట్టారు.

టిఫిన్ బాక్సులతో బాంబుల తయారీ గురించి యూట్యూబ్‌లో వారు నేర్చుకున్నట్టు ఇప్పటికే గుర్తించారు. డమ్మీ బ్లాస్ట్‌ల తర్వాత.. నేరుగా అసలు పేలుళ్లకు ప్రణాళికలు రచించినట్టు తెలిసింది. 'ఇంకో నాలుగు రోజులు ఆగి ఉంటే.. నా సత్తా తెలిసేది' అని కామెంట్ చేసిన సిరాజ్.. పోలీసులకు దొరకకపోయి ఉంటే ఎక్కడ పేలుళ్లకు పాల్పడేవాడో ఊహించుకుంటేనే మతిపోతుందని ఓ పోలీసు ఉన్నతాధికారి చెప్పడం గమనార్హం. దీంతో అంతర్జాతీయ స్థాయిలో నిందితుల బ్యాంకు అకౌంట్లు, సోషల్ మీడియా ఖాతాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు.

**దాడులను తిప్పికొట్టేందుకేనా?**

ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఓ వర్గానికి చెందిన వారిపై వరసగా దాడులు జరుగుతున్నాయని, ఆ దాడులను తిప్పికొట్టేందుకే సిరాజ్, సమీర్ మానవ బాంబులుగా మారాలని సిద్ధపడినట్టు దర్యాప్తులో తెలిసింది. అవసరమైతే బాంబులతో ప్రతిదాడులకు దిగాలనే ప్రణాళికలు వేసినట్టు దర్యాప్తులో తెలిసింది. ఈ క్రమంలో మైనార్టీ వర్గానికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రముఖులు మాట్లాడితే.. వారికి కౌంటర్‌గా కామెంట్లు పెట్టడంలో చురుగ్గా ఉండే వారిని ఎంపిక చేసుకున్నట్టు తెలిసింది.

ఈ క్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రసంగం వీడియో కింద హిందువులకు వ్యతిరేకంగా సిరాజ్ కామెంట్లు పెట్టినట్టు విచారణలో ఒప్పుకున్నాడు. ఇంత జరుగుతున్నా తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం ఉగ్ర కదలికలను పసిగట్టడంలో విఫలమైందని పలువురు ఆరోపిస్తున్నారు. గతం నుంచీ ఉగ్రవాదుల కన్ను హైదరాబాద్‌పైనే ఉన్నదన్న విషయం తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే వాదనలూ వినిపిస్తున్నాయి.

## కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కేసీఆర్ అన్నారు..

- విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లన్నీ కాంగ్రెస్ పార్టీ హయంలోనివే..
- మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా.. ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం..
- కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కేసీఆర్ అన్నారు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని అన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు పెట్టకుండా ఎలా ఇస్తున్నారు.. ఉన్నవన్నీ కాంగ్రెస్ పార్టీ హయంలోనివే అని చెప్పాను.. భద్రాద్రి, యాదాద్రి నుంచి కరెంటు ఉత్పత్తి కాలేదని చెప్తే కేసీఆర్ నుంచి సమాధానం లేదు.. మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు సాగుతున్నాం.. 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చినా కోతలు లేకుండా ఇస్తున్నామంటే అది కాంగ్రెస్ పాలన.. 2050 నాటికి గాలి, సోలార్, నీటి ద్వారా విద్యుత్ ఉత్పత్తిని 20 వేల మెగావాట్ల లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.. 29 లక్షల పంపు సెట్లకు ఇచ్చే కరెంట్ కు రూ.12,500 కోట్లు రైతుల పక్షాన కడుతున్నాం.. మహిళల అభివృద్దే, రాష్ట్ర అభివృద్ధి అని ముందుకు సాగుతున్నాం.. మహిళలకు లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి అన్నారు.

ఇక, 22 వేల కోట్ల రూపాయలతో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్లలో గిరిజనుల గురించి ఏనాడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. సాగు చేసుకుంటుంటే ఆడవాళ్ళు అని చూడకుండా చెట్టుకు కట్టేసి కొట్టారు.. మా ప్రభుత్వంలో ఇందిరా సౌరగిరి జలవికాస పథకం అమలు చేస్తున్నాం.. అడవీని రక్షిస్తూనే.. అడవి బిడ్డల ఆత్మగౌరంగా బతికేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.. గత ప్రభుత్వ హయంలో పెండింగ్ లో ఉంచిన రూ. 8వేల కోట్ల బకాయిలు తీర్చాం.. దెయ్యాలకు నాయకత్వం వహించిన వాళ్ళు దేవుడెలా అవుతారు? అని అడిగారు. ప్రజలను వేధించే దెయ్యాలను తరిమికొట్టే సమయం ఆసన్నమైంది.. ఈ రాష్ట్రంలో సంపద సృష్టిస్తాం, ప్రజలకు పంచేస్తామన్నారు. ప్రజల పక్షమే, మా పాలన లక్ష్యం.. పాలమూరు జిల్లాలో కట్టిన ప్రతి ప్రాజెక్ట్ కాంగ్రెస్ కట్టిందే.. పాలమూరుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.. ప్రాధాన్యతగా ప్రాజెక్ట్ లు పూర్తి చేస్తాం.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిత్యం పర్యవేక్షిస్తూ.. అవసరమైన చోట భూసేకరణకు నిధులు విడుదల చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు.



## ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..

హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):

కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే యుద్ధానికి కూడా సిద్ధమని ప్రకటించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం పాలమాకులలో పండగ సాయన్న ముదిరాజ్, కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రముఖుల విగ్రహాలను పెట్టుకుని గుర్తించుకుంటున్నామని అన్నారు. మన ప్రముఖుల చరిత్రలు బయటకు వస్తున్నాయని తెలిపారు. కృష్ణ స్వామి విగ్రహాలను హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలో నలుమూలల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన చరిత్ర చాలా గొప్పదని.. బలహీన వర్గాల కోసం ఆయన గ్రంథాల్ని రచించారని.. ఆయన ఆనాటి నిజాం కాలంలోనే గుర్తింపబడ్డారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడ్డ 1956 తర్వాత మొదటి మేయర్ కృష్ణ స్వామి అని హరీశ్‌రావు తెలిపారు. ఆయన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేశారని అన్నారు. పండగ సాయన్న భూస్వాములకి వ్యతిరేకంగా పోరాటం చేశాడని తెలిపారు. పెద్దొన్ని కొట్టు పేదలకు పెట్టాలనే నినాదంతో ఆయన పని చేశాడని పేర్కొన్నారు. ఆ కాలంలో పండగ సాయన్న అంటేనే హడల్ అని అన్నారు. పండగ సాయన్న సమాజ శ్రేయస్సు కోసం పనిచేశాడని చెప్పారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేవల్ కిషన్ జాతరను అధికారికంగా ప్రకటించి నిధులు విడుదల చేశారని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ చేయించిన సమగ్ర కుటుంబ సర్వే వల్ల మన ముదిరాజ్ అధిక సంఖ్యలో ఉన్నారని తెలిసిందని అన్నారు. కేసీఆర్ హయాంలోనే మత్సకారులకు వాహనాలు పంపిణీ చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే యుద్ధానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు.

# మనోడు ఎవడో...
## వెన్నుపోటు పొడిచేదెవరో తెలిసింది

- మన పార్టీ నుంచి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలను ఉప ఎన్నికల్లో ఓడించాలి..
- ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం హామీ..
- సీఎం మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి మీద అనుమానం కలుగుతుంది: కేటీఆర్

హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):

గద్వాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పలువురు నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మన పార్టీ నుంచి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలను ఉప ఎన్నికల్లో పండబెట్టి తొక్కే విదంగా ఓడించాలి.. మీ ఆవేశం చూస్తుంటే రాబోయే గద్వాల ఉప ఎన్నికల్లో మనం సామాన్య వ్యక్తిని పెట్టినా గెలుస్తాం అన్నారు.. ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ ఇచ్చిన అభయహస్తం హామీ అని ఎద్దేవా చేశారు. ఎన్ని రోజులు చూడాలి ఈ కాంగ్రెస్ దరిద్రాన్ని అని అందరూ అడుగుతున్నారు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

ఇక, గతంలో నీళ్లు, నిధులు, నియామకాలు అని మనం పని చేస్తే కాంగ్రెస్ పార్టీ నిందలు, దందాలు, చందాలు అని పని చేస్తుంది అని కేటీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి మీద అనుమానం కలుగుతుంది అని పేర్కొన్నారు. అప్పులు పుట్టట్లేదు అంటాడు ఆయనే లక్ష యాభై కోట్ల అప్పు చేసిన అంటాడు.. మరో మూడేండ్లు ఈ దరిద్రం అనుభవించాల్సిందే.. రాబోయే ఏ ఎన్నికలు అయినా కారు గుర్తును గెలిపించాల్సిందే అని కోరారు. కేసీఆర్ ముందే చెప్పినా మనం మోసపోయాం.. జూన్ లో మెంబర్షిప్ ప్రారంభం చేసుకుందాం.. గ్రామ స్థాయి నుంచి పార్టీని డెవలప్ చేసుకుందాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు.




## చంద్రబాబు చేతిలో సీఎం రేవంత్ ఓ కీలుబొమ్మ..

- సూర్యాపేట జిల్లాలో తడిసిన ధాన్యం రాశులని పరిశీలించిన జగదీష్ రెడ్డి..
- బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాలను సమర్థవంతంగా వాడుకున్నాం..
- ప్రధాని సహకారంతో చంద్రబాబు కృష్ణా జలాలను తరలించుకుపోతున్నారు

హైదరాబాద్, మే 26(ప్రజాక్షేత్రం):



తెలంగాణ రాష్ట్రంలో దొంగలు పడ్డారని.. ఎవరికి దొరికింది వారు దోచుకుంటున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సీఎం, మంత్రులు ఎవరి దోపిడీ వాళ్లదేనని అన్నారు. ఐకేపీ కేంద్రాల్లోనే వడ్లు ముక్కి మొలకలొచ్చేస్తున్నాయని.. 60 రోజులైనా వడ్లు కొనలేదంటే ఇంతకంటే దారుణం ఉంటుందా అని మండిపడ్డారు. ఐకేపీ కేంద్రాల్లో రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూర్ గ్రామం ఐకేపీ సెంటర్‌లో తడిసి మొలకెత్తిన వడ్లను మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. రుతుపవనాలు వచ్చి దుక్కి దున్నాల్సిన రైతులు ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సి వస్తుందని అన్నారు. వడ్లు కొనే దిక్కు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంటాలైన తర్వాత మిల్లుల్లో రైతులతో బేరాలు జరుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజులకొకసారి వచ్చే లారీల కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందని.. చివరికి రైతులు దళారుల కాళ్లు పట్టుకునే దుస్థితి దాపురించింది అన్నారు.పంట పండించేందుకు కష్టపడ్డ రైతు.. వడ్లు అమ్ముకునేందుకు మరింత కష్టపడుతున్నాడని జగదీశ్ రెడ్డి అన్నారు. అన్నిరంగాలతో పాటు రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అన్యాయం చేసిందని ఆరోపించారు. ఐకేపీ కేంద్రాల్లో గింజలేకుండా ప్రభుత్వం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు చేతిలో రేవంత్ రెడ్డి కీలుబొమ్మ అని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చంద్రబాబు ఆడించినట్లుగా రేవంత్ రెడ్డి ఆడుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నదులు మళ్లీ దోపిడీకి గురవుతున్నాయని అన్నారు. రేవంత్ కేసుల భయంతో ప్రధాని మోదీ కాళ్లు మొక్కే పనిలో ఉన్నాడని విమర్శించారు.మనసంపద ఆంధ్రకు దోచిపెట్టే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికే కృష్ణా నది దోపిడీ అయిపోయిందని.. బనకచర్లతో గోదావరి దోపిడీకి మరో కుట్ర జరుగుతుందని అన్నారు. బనకచర్లద్వారా గోదావరి జలాలు దోపిడీ జరుగుతున్నా రేవంత్ రెడ్డి మొద్దు నిద్రపోతున్నాడని విమర్శించారు. బీజేపీ , టీడీపీ , కాంగ్రెస్ కలిసి తెలంగాణా నీటిని దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు.

కేసుల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ కాళ్లు పట్టుకుంటే.. మంత్రులు చంద్రబాబుతో పైరవీలు చేయిస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. మంత్రులు కమీషన్ల పనిలో ఉంటే.. చంద్రబాబు తెలంగాణ నీళ్లను దోచుకుంటున్నాడని ఆరోపించారు. కండ్ల ముందు తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. మన నీళ్లు మనకు వాడలేని నీచస్థితిలో ఇక్కడి మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఉన్నారని విమర్శించారు. పాలన చేతగాకపోతే క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని హితవుపలికారు.

## కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం.



- రెండు కార్లను ఢీ కొని, మరో కారు బోల్తా
- సరస్వతీ పుష్కరాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన
- తృటిలో తప్పిన ప్రమాదం, ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్

పెద్దపల్లి,మే 26,(ప్రజాక్షేత్రం): కాళేశ్వరంలోని సరస్వతి పుష్కరాలకు వెళ్లి ఓ కుటుంబం కారులో తిరిగి వస్తుండగా,పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామ శివారులో గల బీఆర్ఎస్ గార్డెన్ వద్ద ఒకదానికొకటి వరుసగా మూడు కార్లు ఢీకొని, మరో కారు పల్టీలు కొట్టి బోల్తా పడింది.కరీంనగర్ లోని జూబ్లీకి చెందిన ఇద్దరు దంపతులు,అలాగే సుల్తానాబాద్ ప్రాంతానికి చెందిన ఇద్దరు దంపతులు టీఎస్ 02 ఈహెచ్ 1481 కారులో కాలేశ్వరంలోని సరస్వతి పుష్కరాలకు వెళ్లి వస్తుండగా,పెద్దకల్వల సమీపంలోని బీఆర్ఎస్ గార్డెన్ వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వస్తున్న మరో కారు,వీరి కారును ఢీకొని మరో కారును ఢీకొన్నది.టీఎస్ 02 ఈహెచ్ 1481 కారులో ప్రయాణిస్తున్న సుజాత, విజయ అనే ఇద్దరు మహిళలు మరియు మురళి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి స్థానికులు అంబులెన్స్ లో సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.



# మందుబాబులకు అడ్డాగా మారిన వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- వేసవి సెలవుల్లో సైతం తరగతి గదులకు తాళాలు వేయ్యని వైనం
- ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకునే నాధుడే లేడా



**ఎర్రవల్లి,మే 26(ప్రజాక్షేత్రం):**జోగులాంబ గద్వాల జిల్లా,ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని తరగతి గదులకు వేసవి కాలం సెలవుల్లో కూడా తాళాలు వేయ్యడం లేదు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోపమా లేదా ప్రభుత్వ పాఠశాలలు అనే లోకువ అర్థం కావడం లేదు.ఇదే చనువుగా మందుబాబులకు అడ్డాగా మారింది.చీకటి పడితే చాలు మందుబాబులు పాఠశాల గదిలో,కాంపౌండ్ లో కూర్చుని దర్జాగా మద్యం తాగుతున్నారు.తాగిన తర్వాత సీసాలు అక్కడే వదిలేసి వెళుతున్నారు.వేసవి సెలవుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు జరగడంతో విద్యార్థులను తమ తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటే భయపడుతున్నారు. మందుబాబులు మందు ప్రభుత్వ పాఠశాలలో మద్యం సేవించడంతో అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారో కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది.ప్రభుత్వ పాఠశాలల పట్ల అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.ఇకనైనా అధికారులు,గ్రామస్తులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్పందించి మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయాలని గ్రామంలోని ప్రజలు కోరుతున్నారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

**నిజామాబాద్,మే 26(ప్రజాక్షేత్రం):**



ఆర్మూర్ పట్టణ కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపకులు రాపోల్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన బాపూజీ విగ్రహాల ముందు జాతీయ పతాకావిష్కరణ చేసి నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించాలని వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాపోల్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ జాతీయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని,ఆంధ్ర మహాసభలు నాయకత్వం వహించి,నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని,బీసీ ఉద్యమ నిర్మాతగా సహకార సంఘాల వ్యవస్థాపకుడిగా వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా సేవలందించి,తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా 1969లో కేబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశారని, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాలలో 97 ఏళ్ల ముదిమి వయసులో పోరాటం చేసి,తుది శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన యోధుడు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సర్వస్వం త్యాగం చేసిన త్యాగశీలి ఇన్ని సుగుణాలు గల తెలంగాణ ఉద్యమ నేత బాపూజీని జాతిపితగా గౌరవించుకుందామని, పద్మశాలి కుల బాంధవులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని,రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండలం పద్మశాలి సంఘం అధ్యక్షులు,హ్యాట్రిక్ సర్పంచ్, రైల్వే బోర్డు డైరెక్టర్ బొడ్డు గంగాధర్,ప్రచార కార్యదర్శి కే ఎల్ బి ఎఫ్ సభ్యులు జింధం నరహరి,రాజహంస డ్రెస్సెస్ అధినేత శేఖర్,స్వాతిన్ రవికుమార్,జెల్లా నరేంధర్ నేత,కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ సభ్యులు పోల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నిధి వొకేషనల్ జూనియర్ కళాశాల ఫస్ట్ ఇయర్ MPHW కోర్స్ లో టాపర్ గా అలంపూర్ కు చెందిన విద్యార్థిని చిన్నారి



**అలంపూర్,మే 26(ప్రజాక్షేత్రం):**జోగులాంబ గద్వాల జిల్లా,అలంపూర్ పట్టణానికి చెందిన విద్యార్థిని చిన్నారి,పెబ్బేరు పట్టణంలోని శ్రీనిధి వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ లో చదువుతుంది.కళాశాల యాజమాన్యం,ఉపాధ్యాయ బృందం,కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి 476/500 మార్కులు సాధించి కళాశాల టాపర్ గా నిలిచింది.ఈ సందర్భంగా విద్యార్థిని చిన్నారి ఆనందం వ్యక్తం చేసింది.చిన్నారి తల్లి జానకమ్మ కూడా ఆనందం వ్యక్త పరిచారు.

## జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఏజేఆర్



**వలిగొండ,మే 26(ప్రజాక్షేత్రం):**మండల పరిధిలోని వెల్వర్తి గ్రామానికి చెందిన నిజం న్యూస్ రిపోర్టర్ కూచిమల్ల నాగేష్ మాతృమూర్తి కూచిమల్ల లక్ష్మమ్మ ఇటీవల హఠాత్మరణం చెందగా విషయం తెలుసుకున్న ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సౌజన్యంతో రూ.10 వేలు వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా సోమవారం వారి కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మారగోని శ్రీనివాస్ గౌడ్,అధ్యక్షులు బాలగోని హనుమంత్ గౌడ్, సభ్యులు బోడిగే సుదర్శన్ గౌడ్, రెబ్బ కుమారస్వామి, బలుగూరి వెంకట్ రెడ్డి, దేశపాక కృష్ణ స్వామి,నీలం నరేందర్,సంగిశెట్టి విజయ్ కుమార్,దంతూరి నరేష్, మార్క భగవంతు,వీసం రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు



**వలిగొండ,మే 26(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్పూర్ గ్రామం మదిరే పల్లెంపుకి చెందిన మద్ది అరుణమ్మ పాము కాటుక మృతి చెందింది.ఏజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి ద్వారా పదివేల రూపాయలు సహాయం అందజేశారు .ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గూడూరు నరసింహారెడ్డి,బాదితులు పాల్గొన్నారు.

# ఈనెల 30న కలెక్టరేట్ వద్ద ఉపాధి హామీ కూలీల ధర్నాకు వందలాదిగా తరలి రండి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహా

**చౌటుప్పల్,మే 26(ప్రజాక్షేత్రం):**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు వందలాదిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు తరలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు.తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చౌటుప్పల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మందోల్లగూడెం ,దర్మోజిగూడెం గ్రామాలలోని ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం నర్సింహ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వారం వారం డబ్బులు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు.పేరుకు ప్రభుత్వము రోజు కూలీ 307 రూపాయలు నిర్ణయించిన 150 నుండి 230 రూపాయలు దాటడం లేదని ఆవేదన వెలిబుచ్చారు.ఇప్పటికైనా కొలతలతో సంబంధం లేకుండా నిర్ణయించిన రేటు కాకుండా రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో 6 కోట్ల పని దినాలు అవసరము ఉంటే మోడీ ప్రభుత్వం 3 కోట్ల పని దినాలు మంజూరు చేస్తే మరి మిగతా రోజులు కార్మికులు ఏమి పని చేయాలని నర్సింహ ప్రశ్నించారు.ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వము సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా అమలు చేయాలని కోరారు.ఉపాధి హామీలు ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను,ఫీల్డ్ అసిస్టెంట్లను భర్తీ చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు మాట్లాడుతూ పని ప్రదేశంలో తాగడానికి నీళ్లు,నీడ కోసం టెంట్,పని ప్రదేశంలో గాయపడితే చికిత్స అందించడానికి మెడికల్ కిట్టు తక్షణమే ఏర్పాటు చేయాలని అన్నారు.దరఖాస్తు చేసుకున్న ప్రతి వారికి పని కల్పించాలని, నూతన జాబులు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడితే రోజు కూలీ కట్టి ఇవ్వాలని,చనిపోతే 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని,వాచర్సును, మెట్లను గుర్తించి అర్హత కలిగిన వారందరికీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని వీటి సాధన కోసం ఈనెల 30న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొజ్జ బాలయ్య,జిఎంపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు యాట ముత్యాలు,జంగం అంజయ్య,పెంటారెడ్డి, సిఐటియు నాయకులు కొంతం శ్రీనివాస్ రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ చెనబోయిన జ్యోతి,ఉపాధి హామీ కార్మికులు యాదిరెడ్డి, అంజయ్య,పగిళ్ల అనుజ,నీళ్ల కావ్య,యాట బక్కయ్య,గంట సప్న,నీళ్ల రేణుక,కవిత,సప్పిడి రాములమ్మ,అంజమ్మ, బుచ్చమ్మ,జంగమ్మ,జ్యోతి, సప్పిడి కృష్ణారెడ్డి,యాట ఎట్టయ్య,నీళ్ల యాదగిరి,జే శ్రీలత,వై పద్మ,అనిత,నిర్మల, శంకరమ్మ,అనసూయ,మంగ, బుచ్చమ్మ,సునీత,అమృత, పద్మ,ఇంద్ర,లావణ్య,శైలజ, జయమ్మ,వసంత తదితరులు పాల్గొన్నారు.








## మంత్రివర్గ విస్తరణలో బీసీలకు సముచితస్థానం కల్పించాలి

**మిర్యాలగూడ,మే 26(ప్రజాక్షేత్రం):**తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తూ వస్తుంది ప్రస్తుతం ఉన్న అన్ని శాఖలలో అగ్రవర్ణాలకే పెద్దపీట వేస్తూ వస్తుంది ..ఓట్లు మావి సీట్లు మీవా బీసీలు కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు ప్రస్తుతం మంత్రి పదవుల్లో అత్యధికంగా అగ్రవర్ణాలే కార్పొరేషన్ చైర్మన్ లలో అత్యధికంగా అగ్రవర్ణాల ఎమ్మెల్యే ల లో అత్యధికంగా అగ్రవర్ణాలలే ఇలా ప్రతి ప్రతి శాఖలో అగ్రవర్ణాలే కీలక పదవులు అనుభవిస్తామన్నారు.కాబట్టి త్వరలో జరగనున్న నూతన మంత్రివర్గ విస్తరణలో అయినా బీసీలకు సముచిత స్థానం కల్పించి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో దాసరాజు జయరాజ్,మహేష్ గౌడ్, సురేష్ యాదవ్, గంగాధర్,ఉపేందర్,రవీందర్ నాయక్,శ్రీను,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ చట్టం ప్రజల శస్త్రంగా మారాలి

### పెద్దమందడి మండల ఆర్టీఐ అధ్యక్షుడు నక్క కృష్ణ యాదవ్



**పెద్దమందడి,మే 26(ప్రజాక్షేత్రం):**సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెద్దమందడిలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మండల ఆర్టీఐ అధ్యక్షుడు నక్క కృష్ణ యాదవ్ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఆర్టీఐ చట్టం ఒక శక్తివంతమైన ఆయుధంగా ఉండాలని,ప్రతి పౌరుడు దీన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.“ప్రజల ప్రశ్నించే హక్కే ప్రజాస్వామ్యానికి ప్రాణం అని. ఆర్టీఐ ద్వారా ప్రజలు ప్రభుత్వ అధికారులను సమాధానం చెప్పే బాధ్యతతో ఉంచవచ్చు ,”అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, ఖర్చులు,నియామకాలు, పథకాల అమలు వంటి ఎన్నో అంశాలపై సమాచారం అడిగే హక్కు ప్రతి పౌరునికీ ఉందన్నారు.

**ఆర్టీఐ దరఖాస్తు చేయవచ్చిన కొన్ని ముఖ్య అంశాలుగా ఆయన పేర్కొన్నవి:**

1.గ్రామ అభివృద్ధి పనుల ఖర్చులు, కాంట్రాక్టుల వివరాలు

2.ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల జాబితాలు

3.రేషన్, పింఛన్ లావాదేవీలు మరియు ఆలస్యం కారణాలు

4.ఉద్యోగ నియామకాల ప్రక్రియ, ఎంపికైన అభ్యర్థుల వివరాలు

5.ఆరోగ్య కేంద్రాల్లో మందుల సరఫరా, వైద్య సిబ్బంది సమాచారం

6.ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదు వివరాలు

7.భూముల రికార్డులు, పట్టాదారుల మార్పుల వివరాల పై ఆర్టీఐ వెయ్యొచ్చు అని తెలిపారు.

RTI దరఖాస్తు చేయాలంటే ₹10 ఫీజుతో సంబంధిత శాఖకి అర్జీ ఇవ్వవచ్చని తెలిపారు. బీపీఎల్ కార్డుదారులకు ఈ ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు.

**తదుపరి చర్యలపై స్పష్టత:**

ఆర్టీఐ దరఖాస్తు చేసిన తర్వాత సంబంధిత అధికారుడు 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని కృష్ణయాదవ్ తెలిపారు.అయితే సమాధానం రాకపోతే పౌరులు ఇలా కొనసాగవచ్చని వివరించారు:

1. ఫస్ట్ అప్పీల్ – పై స్థాయి అధికారికి అప్పీల్ దాఖలు చేయాలి.


2. సెకండ్ అప్పీల్ – స్టేట్ లేదా సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ వద్ద రెండో స్థాయి అప్పీల్ వేయవచ్చు.

3. శిక్షలు – అధికారుల నిర్లక్ష్యం లేదా మోసపూరితంగా సమాచారం ఇవ్వకపోతే రోజుకు ₹250 చొప్పున జరిమానా, గరిష్ఠంగా ₹25,000 వరకు విధించవచ్చు.

“ఆర్టీఐ చట్టం ప్రభుత్వ అధికారులను జవాబుదారులుగా మార్చే సాధనంగా పనిచేస్తుంది. ప్రజలు దీనిని ధైర్యంగా, చట్టపరంగా వినియోగించాలి,” అని ఆయన వివరించారు.

## మద్దిగట్ల వాకింగ్ క్లబ్ సభ్యులకు ఆర్థిక సహాయం

**పెద్దమందడి మే 26(ప్రజాక్షేత్రం):**పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామం వాకింగ్ క్లబ్‌కు చెందిన ఒక సభ్యుడు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో, సహాయంగా మానసిక బలాన్ని అందిస్తూ,ఫెలో వాకింగ్ క్లబ్ సభ్యులు వారి తరఫున రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా బాధిత సభ్యుడు మరియు మద్దిగట్ల వాకింగ్ సభ్యులు వాకింగ్ శ్రీను వాకిటి సహృదయానికి కృతజ్ఞతలు తెలిపారు.సహాయ కార్యక్రమంలో మద్దిగట్ల వాకింగ్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## లింగపాలెం టిడిపి మండల పార్టీ అధ్యక్షులుగా గరిమళ్ల చలపతిరావు

**ఏలూరు జిల్లా,మే 26 (ప్రజాక్షేత్రం):**



లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా మరోసారి గరిమెళ్ళ చలపతి రావు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆర్థిక శుభాకాంక్షలు భవిష్యత్తులో మీరు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా గ్రామ ప్రజలు కోరుకుంటున్నారూ.

# కె ఆర్ ఆర్ బ్రైట్ మైండ్స్ స్కూల్ ప్రారంభోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

**ఏలూరు జిల్లా,మే 26 (ప్రజాక్షేత్రం):** ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామంలో కె ఆర్ ఆర్ బ్రైట్ మైండ్స్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే పాల్గొన్నారు.ముందుగా శాసనసభ్యులకు కే ఆర్ ఆర్ స్కూల్ చైర్మన్ కొర్రపాటి సుధాకర్ మరియు స్కూల్ సిబ్బంది శాసనసభ్యులకు పూర్ణ కుంభం తో ఘన స్వాగతం పలికారు.ముందుగా చదువుల తల్లీ సరస్వతి దేవి కీ పూజలు అర్పించి వేదిక వద్దకు వెళ్లారు

శాసన సభ్యులు మాట్లాడుతూ.. కేఆర్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ కొర్రపాటి సుధాకర్ నాలాగే ఎన్ఆర్ఐ అని ఎంతో కష్టపడి చదివి పైకి వచ్చారని అంటే అలాగే విద్యను అందరికి అందించాలని అటువంటి ఉద్దేశ్యంతో ఈరోజు ఎన్నో కష్టాలకి,వడిదుడుకులను ఎదుర్కొని కే ఆర్ ఆర్ స్కూలుకీ పూర్వ వైభవం తీసుకొచ్చే ఆలోచనలో చైర్మన్ ఉన్నారు. ఈరోజు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ఉన్నత విలువలతో కూడిన విద్య ను,ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యను ఈ పాఠశాలలో భోదించాలనే సదుద్దేశంతో ముందుకు రావడం చాలా సంతోషమన్నారు. అలాగే తల్లిదండ్రులందరూ కూడా పిల్లల్ని ఇక్కడ చదివించడానికిముందుకురావాలనిచెప్పితెలియజేశారు మరీ ముఖ్యంగా ప్రధానమంత్రి లక్ష్యం దేశ భవిష్యత్ కోసం వికసిత్ భారత్ 2047 గురించి చాలా బాగా వివరించారు.దేశ ఆర్థిక పురోగతి సాధించడానికి తలసారి ఆదాయం పెరిగినప్పుడు ఇది సాధ్య పడుతుంది అని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో చివరగా కేఆర్ ఆర్ స్కూల్స్ చైర్మన్ కొర్రపాటి సుధాకర్ శాసనసభ్యులు, వారిని చేనేత వస్త్రాలతో చేసినటువంటి శాలువాతో ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో కామరకోట మండల కూటమి నాయకులు,కార్యకర్తలు, విద్యార్థులు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# లక్షల బేరం...అదనపు అంతస్తుల నిర్మాణం.

- 50వ వార్డు మురళి నగర్ లో జీవీఎంసీ అండదండలతో అక్రమ కట్టడం.
- లక్షల రూపాయలు లంచంగా స్వీకరించినట్లు జోన్ అధికారులపై ఆరోపణలు
- అనుమతి లేదని తెలిసినా అందుకే చర్యలు లేవంటున్న స్థానికులు



**విశాఖపట్నం,మే 26(ప్రజాక్షేత్రం):** జీవీఎంసీ జోన్ 5 పరిధి 50వ వార్డు మురళి నగర్ లో అక్రమ కట్టడానికి టౌన్ ప్లాన్ అధికారులు కొమ్ము కాస్తున్నారు. అవినీతి పునాదులపై అదనపు అంతస్తులు కడుతున్న జీవీఎంసీ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. 39842/2 గల నిర్మిస్తున్న నూతన భవనం ప్లానింగ్ విరుద్ధంగా కట్టడమే కాకుండా జీవీఎంసీ ఆదాయానికి బారీగా గండిపడుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్లానింగ్ సెక్రటరీ నుండి పై అధికారుల వరకు భారీగా ముడుపులు ఇచ్చామని బహిర్గతంగానే వినిపిస్తున్నాయి.

కనీసం అక్రమ నిర్మాణం కడుతున్నప్పటికీ, ఇసుక దుమ్ము అటుగా వెళుతున్న బాటసారిలపై డెబ్రీస్ పడుతున్న కూడా కనీసం గ్రీన్ మ్యాట్ వెయ్యాలన్న నిబంధన కూడా పాటించడం లేదు. ఎవడైతే నాకేంటి అన్న విధంగా భయం లేకుండా అక్రమ నిర్మాణాన్ని జోరుగా సాగిస్తున్నారు. సింహాచలం దేవస్థానం స్థలం కూడా కొంత ఆక్రమించినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇష్టానుసారంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుకు భారీ ముడుపులు చెల్లించడం వలన ఎటువైపు జీవీఎంసీ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. జీవీఎంసీ కి అదనపు అంతస్తు పేరిట రావలసిన కోట్లాది రూపాయలు గండి కొడుతున్న అక్రమ బిల్డర్లను అరికట్టే విధంగా అవినీతి అధికారులపై వేటు వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అక్రమ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పదిమందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

**నిజామాబాద్,మే26(ప్రజాక్షేత్రం):** ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవర్ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పదిమంది పై కేసు నమోదు అయిందని సోమవారం ఆర్మూర్ సీఐ సత్యనారాయణ తెలిపారు.పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ చేసి కోర్టు ఎదుట హాజరుపరిచారు.మొత్తం 10 మందిని రెండు రోజుల సాధారణ జైలు శిక్ష ఆర్మూర్ సెకండ్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ గట్టు గంగాధర్ శిక్ష ను విధించారు.



# జర్నలిస్టులు మంచిని వెలికి తీయాలి

- పత్రికల్లో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- ఒక్కొక్క కాన్స్టిట్యూషన్ గురించి ప్రచురించాలి.
- ఉత్తమ జర్నలిస్టులను సన్మానించడం అభినందనీయం.
- సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి.

**ఆర్మూర్,మే 26(ప్రజాక్షేత్రం):** జర్నలిస్టులు ప్రజల సమస్యలతో పాటు మంచిని పత్రికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మంచిర్యాల నరేందర్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.జర్నలిస్టులు తమ తమ పత్రికలలో కాన్స్టిట్యూషన్ లోని చట్టాలను ప్రజలకు వివరించాలన్నారు. అనేకమందికి చట్టాలపై అవగాహన ఉండదన్నారు. మండల లీగల్ సర్వీస్ చైర్ పర్సన్ గా తన ఆధ్వర్యంలో న్యాయ సేవలు అందిస్తామన్నారు.పేదలు వృద్ధులు ఈ సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు.దీనిని పేదలు,వృద్ధులు,ప్రజలు న్యాయ సేవలు పొందవచ్చన్నారు.వచ్చేనెల 14వ తేదీన ఆర్మూర్ కోర్ట్ ఆవరణలో మెగా లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ లోక్ అదాలత్ లో రాజీపడ్డ కేసులు,చిన్నచిన్న కేసులను పరిష్కరించుకోవడానికి ఉపయోగించుకోవాలని కోరారు. నవనాతపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులను అవార్డుమిర్చి సన్మానించడం అభినందనీయమన్నారు. ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టులు అంకితభావంతో పనిచేస్తారని ప్రశంసించారు. వారికోసం తమ ఫౌండేషన్ ద్వారా ప్రమాద భీమా ఇన్సూరెన్స్ ను చేయించడం జరిగిందన్నారు.రాబోయే రోజులలో జర్నలిస్టు మిత్రులకు అండగా ఉంటానని చెప్పారు.తన తండ్రి ఆశయాల మేరకు విద్య,వైద్యంలో పేద ప్రజలకు అండగా ఉండడం కోసం తన వంతుగా ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. పేదలకు మంచి విద్యా వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. చక్కటి వార్తలు రాసి సమాజానికి ఉపయోగపడే వార్తలు రాసిన జర్నలిస్టులకు సన్మానించుకోవడం మంచి కార్యక్రమం అని ప్రశంసించారు. ముఖ్య అతిథులుగా వచ్చిన సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి, ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ కు శాలువా మెమొంటోతో సన్మానించారు. ఉత్తమ విలేకరిగా (ప్రథమ బహుమతి) సాత్ పుతే శ్రీనివాస్,ద్వితీయ ఉత్తమ విలేకరిగా ఖోడే మనోహర్, తృతీయ ఉత్తమ విలేకరిగా గోలి పురుషోత్తం,కన్సోలేషన్ అవార్డు షికారి శ్రీనివాస్, మ్యాకల దినేష్ లు ఎంపిక కాగా శాలువా అవార్డులతో న్యాయమూర్తి శ్రీదేవి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాంప్రసాద్,కొండి రామచందర్,చందు, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్, నవనాతపురం ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు వినోద్, ప్రధాన కార్యదర్శి మహేష్,కోశాధికారి గోజురు మహిపాల్,సంయుక్త కార్యదర్శులు రాజేందర్, దినేష్,సాంస్కృతిక కార్యదర్శి సూరిబాబు,జర్నలిస్టులు సాత్ పుతే శ్రీనివాస్,గంధం చిరంజీవి,గణేష్ గౌడ్,శ్రావణ్, ఏశ్వని నితీష్,విన్సెంట్, ఇట్టేడి మోహన్ రెడ్డి,చరణ్ గౌడ్, అజీమ్,అశోక్,గోలి పురుషోత్తం,గంగా మోహన్, షికారి శ్రీనివాస్, సామ సురేష్, బారడ్ గణేష్,గట్టడి అరుణ్, లిక్కి శ్రావణ్,ముఖేష్,పోహార్ కిరణ్,మెమొంటోలతో సన్మానించారు.






# బెల్లి లలితక్కకు ఘనంగా నివాళి అర్పించిన టియు జేఏసీ

**వలిగొండ,మే 26(ప్రజాక్షేత్రం):** భువనగిరి జిల్లా కేంద్రంలో సోమవారం తెలంగాణ ఉద్యమ గాన కోకిల బెల్లి లలితక్క 26వ వర్ధంతి వేడుకలను టి యు జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీజేఏసీ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బెల్లి లలితక్క ఆట పాటలతో ప్రజలను ఉద్యమం వైపు మళ్ళించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఏర్పాట్లు బెల్లి లలితక్క పాత్ర మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమం లో బెల్లీ లలితక్క కుమారుడు సూర్యం ఉద్యమ కళాకారుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డోలక్ యాదగిరి టియు జెఏసి మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాకారం లావణ్య. యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు చేర్యాల సుగుణమ్మ చంద్రకళ అనురాధ కొత్త లలిత గంగిరాజుతదితరులు పాల్గొన్నారు.



# శ్రీహరిపురం ఆ బిల్డింగ్ సెటిల్మెంట్ కి ఇద్దరూ ఇద్దరే

**శ్రీహరిపురం,మే 26(ప్రజాక్షేత్రం):** జోన్ 5 పరిధిలో శ్రీహరిపురం గణేష్ మందిర్ వెనుక అనుమతి లేకుండా అదనపు అంతస్తుల నిర్మాణం ప్లానింగ్ సెక్రటరీ పూజ,టిపిఓ నిఖిల అక్రమ నిర్మాణాలకు మద్దతు వీరికి జోనల్ ఏసిపి సహకారం అంతా కలిపి వసూలు చేసిన సొమ్ము వాటాలుగా పంపిణీ, జోన్ 5 పరిధిలో పనిచేస్తున్న సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ మరియు జోన్ టిపిఓ ఇద్దరూ కలిసి అనధికారికంగా నిర్మిస్తున్న నిర్మాణాల పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లుగా ఆరోపణలు అడ్డగోలుగా వారి నుంచి వసూళ్లు చేసి పై స్థాయి అధికారులకు కూడా వాటాలు పంచుతున్నట్లుగా వార్డులో ఆరోపణలు వినబడుతున్నాయి.దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ పూజ ఆమెకు సహకరిస్తున్న టీ పిఓ నిఖిల అవినీతి వ్యవహారం రోజురోజుకు శృతి మించి రాగాన పడుతోంది. సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ, జోనల్ టిపిఎస్ ఇద్దరూ కలిసి జోనల్ పరిధిలో నిర్మిస్తున్న అనధికార నిర్మాణాల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. వీరికివిశాఖజోనల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి పూర్తిగా మద్దతుగా వ్యవహరిస్తున్నారని తెలిసింది.అందువలన వీరిద్దరూ తోడుదొంగల్లా వసూళ్లు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.జోన్ 5 పరిధిలో ఉన్న శ్రీహరిపురం వద్దగల గణేష్ నగర్ వెనుక నిర్మిస్తున్న ఓ భవనంపై మరో అంతస్తు అనుమతి లేకుండా నిర్మిస్తున్న సంగతి వెలుగు చూసింది.దీనికి స్థానిక సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ పూజ,టీపీఎస్ నిఖిల తమ వంతు సహకారం అందించినట్లుగా తెలుస్తోంది. అందువలన అనుమతి లేకుండా నిర్మిస్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.సచివాలయం పరిధిలోని అడ్డగోలుగా ప్లానింగ్ సెక్రటరీ పూజ, టీపీఎస్ నిఖిల వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీరికి జోనల్ టౌన్ ప్లానింగ్ ఏసీబీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లుగా తెలిసింది. అందువల్ల వీరు చెప్పిందే వేదం అన్నట్టుగా మారింది. ప్రస్తుతం నిర్మిస్తున్న టుడే బిల్డింగుకు నించి స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ పూజ, టీపీఎస్ నిఖిల మద్దతుగా నిలిచి బిల్డింగ్ యజమాని నుంచి కొంత మొత్తాన్ని లంచంగా స్వీకరించినట్లుగా తెలిసింది. ఇందులో కొంత వాటా జోనల్ ఏసీపీకి పంపించినట్లుగా కూడా తెలిసింది.అందువలన అనుమతి లేకుండా నిర్మిస్తున్న చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. సచివాలయం పరిధిలో నిర్మిస్తున్న భవనాల వద్ద అడ్డగోలుగా పూజ వసూలు చేస్తున్నట్లుగా పలు ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం శ్రీహరిపురం లో నిర్మిస్తున్న ఈ భవనంపై టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు దృష్టి సాధించాలని దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికలు కోరుతున్నారు.

# తెలుగువారి పండగలా ఎన్టీఆర్ ఆత్మ గౌరవ దినోత్సవం జరుపుకోవాలి.

- తెలుగువారి పండగలా ఎన్టీఆర్ ఆత్మ గౌరవ దినోత్సవం జరుపుకోవాలి.
- ప్రభుత్వం వెంటనే దీనిపై జీవో విడుదల చేయాలి
- ఎన్టీఆర్ ని తెలుగు ప్రజలు భగవంతునిలా కొలిచేవారు.
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ విజ్ఞప్తి

**విశాఖపట్నం,మే 26(ప్రజాక్షేత్రం):** స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిని తెలుగు వారి ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించాలని,ప్రభుత్వమే నిర్వహించే విధంగా జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు.విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలుగు వారందరి ఆరాధ్య దైవమైన ఎన్టీఆర్ ను ప్రజలు తిరుపతి వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకుని తర్వాత చెన్నై వెళ్లి ఎన్టీఆర్ ని కలిసి వచ్చేవారు. ఆయన్ని ఒక భగవంతుడిలా కొలిచేవారు.ఆ స్థాయి భారతదేశంలో ఎవరికీ లేదు. రాష్ట్ర ప్రభుత్వాన్ని,సిఎం చంద్రబాబునాయుడుని నేనెప్పుడూ ఏదీ కావాలని అడగలేదు,పదవులు ఆశించలేదు. రాష్ట్రపరంగా పండగలా ఎన్టీఆర్ జయంతిని జరుపుకోవాలని తెలుగు ప్రజల ఆకాంక్ష.దానికోసమే నేను చంద్రబాబు నాయుడు ని విజ్ఞప్తి చేస్తున్నాను. అంతకుమించి ఇందులో ఏ స్వార్ధము లేదు.ఎన్టీఆర్ వర్ధంతి జనవరి 18,నా జననం కూడా జనవరి 18.అందుకే ఆయన మీద నాకు అత్యంత ప్రేమ అభిమానాలు ఉన్నాయి. తెలుగు ప్రజలు గుండెల్లో ఉన్న ఎన్టీఆర్ జయంతిని ఆత్మగౌరవ దినోత్సవంగా జరిపితే తెలుగుజాతి గౌరవం మరింత పెరుగుతుంది.కాబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,బిజెపి రాష్ట్ర అధ్యక్షులు,ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి కూడా దీని పై సానుకూలంగా స్పందించి ఎన్టీఆర్ జయంతిని ఆత్మగౌరవ దినోత్సవంగా జరుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఎంతో మంది తెలుగువారి గుండెల్లో ఆయన ఉన్నారు. కానీ బయటికి చెప్పలేకపోతున్నారు.27 తేదీలోగా జీవో ప్రకటించి ఎన్టీఆర్ జయంతిని పండగలా జరుపుకునే విధంగా జీవో విడుదల చేస్తే మహానాడు కూడా పండగ వాతావరణంలో జరుగుతుంది.చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ట మరింత పెరుగుతుందని తెలియజేస్తున్నాను.విలేకరుల సమావేశంలో కోడె బాబురావు తదితరులు పాల్గొన్నారు.






# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి**

**సుల్తానాబాద్,మే 26,(ప్రజాక్షేత్రం):** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు పాటించాలని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి స్పష్ట చేశారు.సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని ఆటో ఓనర్స్,డ్రైవర్స్ కి ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు పాటించాలని సూచించారు.రాంగ్ రూట్ లో ప్రయాణం చేయడం నేరమని,డ్రైవింగ్ చేసేప్పుడు సెల్ ఫోన్ వాడకూడని పేర్కొన్నారు.అలాగే వాహనం నడిపేటప్పుడు మద్యం సేవించి పట్టుబడితే,అధిక జరిమానా తో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆటో ఓనర్స్, డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసిన రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,మే 26 (ప్రజాక్షేత్రం):** రాష్ట్రంలోని పేదలకు ప్రభుత్వం అనేక అనేక పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మేలు చేస్తుందని,పేదలకు న్యాయం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరు అయిన 238 ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఆయన సోమవారం కోకాపేటలో మంజూరు పత్రాలను అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కష్టసుఖాలు తెలిసినవారని వారికి అవసరమైన అన్ని రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆయన అన్నారు.ప్రభుత్వ పథకాలను అందుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఆయన సూచించారు.పేద ప్రజల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా ఇవ్వడం చరిత్రలోనే మొదటిసారి అని, వాటిని ప్రతి ఒక్కరు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ గృహాలు రానివారు ఇంకా ఎవరైనా ఉంటే రాబోయే రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని



వారందరికీ మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి,గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్,నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నార్సింగ్ మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, రామేశ్వరం నరసింహ లతోపాటు మాజీ కౌన్సిలర్ లు ఉషారాణి,శివారెడ్డి, ప్రవీణ్,నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా అవకాశం కల్పించాలని కోరుతున్న కరంటోతు ప్రజ్ఞా నాయక్

**చౌటుప్పల్,మే 26(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా,సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రనికి చెందిన కంకణాల గూడెం మాజీ సర్పంచ్ కారంటోతు ప్రజ్ఞా నాయక్ సోమవారం రోజు చౌటుప్పల్ లోని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో ఏఐసీసీ కోఆర్డినేటర్ లను కలిసి తనకు చౌటుప్పల్ నారాయణపురం మండల బ్లాక్ అధ్యక్షనిగా అవకాశం ఇవ్వాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ నిబంధనల ప్రకారం దరఖాస్తు ఫారం నింపి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రజ్ఞా నాయక్ మాట్లాడుతూ తను గత 25 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలు చేస్తూ వస్తున్నానని గతంలో 2018లో కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద కంకణాల ఎంపీటీసీగా పోటీ చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ కార్మిక అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ మండల అధ్యక్షునిగా మరియు చౌటుప్పల్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నానని,గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనపై ఎన్నో వ్యతిరేక



ఉద్యమాలు కార్యక్రమాలు చేశానని తన సొంత డబ్బులు వెచ్చించి పార్టీ కోసం కార్యకర్తలను కాపాడుకుంటూ వస్తున్నానని,అదేవిధంగా గతంలో కూడా బ్లాక్ కాంగ్రెస్ నారాయణపురం మండలానికి కేటాయించలేదు.కాబట్టి ఈసారి నారాయణపురం మండలానికి కేటాయించాలని ఏఐసిసి నాయకులకు తెలియజేశానని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం తన పనితనాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా అవకాశం ఇవ్వాలని ఏఐసిసి నేతలకు తెలియజేశాని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఎస్సైను సన్మానించిన యు ఆర్ టి పి నాయకులు

**నిజామాబాద్,మే 26(ప్రజాక్షేత్రం):** ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై కొల్లూరు రమేష్ ను యు.ఆర్ టి.పి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో యు ఆర్ టి పి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు అరుణ జ్యోతి,జిల్లా అధ్యక్షులు బాగై శ్రీనివాస్ ఆర్మూర్ బీసీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఆర్మూర్ మైనార్టీ అధ్యక్షులు మహబూబ్ మండల అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.




# అత్యవసర సమయాల్లో రోగులను కాపాడడంలో కీలక పాత్ర అంబులెన్స్ పైలెట్ లు

**పైలెట్ దినోత్సవం సందర్భంగా కేక్ కటింగ్ చేసి - శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కో ఆర్డినేటర్ రత్నమయ్య,**

**జోగులాంబ గద్వాల జిల్లా,మే 26 (ప్రజాక్షేత్రం):**

జోగులాంబ గద్వాల జిల్లా ఆసుపత్రిలోని 108 అంబులెన్స్ కార్యాలయంలో పైలెట్ దినోత్సవ వేడుకలను కేక్ కటింగ్ చేసి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా 108 జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్య మాట్లాడుతూ ప్రమాద సంఘటన స్థలంలో క్షతగాత్రులు ప్రాణాలతో విలవిలలాడుతున్న సమయంలో సమాచారం అందుకున్న వెంటనే హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించడంలో అంబులెన్స్ పైలెట్ల పాత్ర మరువలేనిదని అన్నారు.అంతేకాకుండా పేషంటు పరిస్థితి సీరియస్ గా ఉన్న సమయంలో డాక్టర్ల సూచన మేరకు దూర ప్రాంతాలైన కర్నూల్, మహబూబ్ నగర్, హైదరాబాద్ వంటి నగరాలలోని ఆస్పత్రులలో చేర్పించి రోగికి వైద్యాన్ని అందించడంలో అంబులెన్స్ పైలెట్ ల కృషి వెలకట్టలేనిదని అన్నారు.రోగులను తమ ఇంటి మనసులుగా భావించడంలో అంబులెన్స్ పైలెట్ లు మానవత్వానికి మారుపేరు అని అన్నారు. అదేవిధంగా పైలెట్ లు రాత్రినకా,పగలనకా డ్యూటీ చేస్తున్న సమయంలో తమ ఆరోగ్యం



పట్ల కూడా చూసుకోవా లని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ పైలెట్లు పాల్వాయి అంజి,అభిషేక్,స్యాసు,కృష్ణ,భాస్కర్,ప్రభాకర్,బిజ్వారంరవి,తిక్కన్న,రఘు,రవి,ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషన్ లు తిమ్మెష్,శ్రీను,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలే పిల్లల భవితకు పునాది

**మండల విద్యాధికారి జి.సురేష్**

**జోగులాంబ గద్వాల జిల్లా,మే 26(ప్రజాక్షేత్రం):** 202526 బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్ నందు మండల విద్యాధికారి జి.సురేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు మరియు మదర్స్ కమిటీ లకు సమావేశం నిర్వహించ డమైనది.ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవితకు పునాది వేస్తాయని,ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి పై శ్రద్ధ తీసుకుంటారని, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లలో చదివే 5+ వయస్సు గల ప్రతి విద్యార్థిని సమీపంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల యందు చేర్పించి వివరాలను సమర్పించాలని సూచిం చారు.అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థిని సమీపంలో గల ఉన్నత పాఠశాలల యందు చేర్పించి వివరాలను సమర్పిం చాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యులను కోరడమైనది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిడిపిఓ బి.హేమలత, సూపర్వైజర్ నాగరాణి, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్,బజారన్న,మునెప్ప,లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు,సి.ఆర్.పి.లు పరమన్న,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ సబ్ రిజిస్టర్?

**ఖమ్మం జిల్లా,మే 26(ప్రజాక్షేత్రం):** లంచం తీసుకుంటూ ఏసీపీ కి పట్టుబడింది ఖమ్మం రూరల్ సబ్ రిజిస్టార్ అరుణ.ఆమెను ఏసీబీ అధికారులు ఈరోజు వలవేసి నేరుగా పట్టుకున్నారు.వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా,రూరల్ మండలం తల్లంపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 2వేల గజాలు తన కొడుకు పేరు మీద గిఫ్ట్ డీడ్ కోసం సబ్ రిజిస్టర్ అరుణ ను ఆశ్రయించగా రూ.యాభై వేలు డిమాండ్ చేసింది.దీంతో గత్యంతరం లేక బాధితులు ఏసీబీ ని ఆశ్రయించారు. ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో డాకుమెంట్స్ రైటర్ పుచ్చాకాయల వెంకటేశ్వర రావు ద్వారా గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కు రూ.30 వేలు లంచం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.ఈ మేరకు సోమవారం రిజిస్ట్రేషన్ చేసేందుకు డాకుమెంట్స్ రైటర్ పుచ్చాకాయల వెంకటేశ్వర రావు ద్వారా రూ.30 వేలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో ఏసీబీ దాడి చేసి పట్టుకున్నారు.గత 9 నెలల క్రితమే సబ్ రిజిస్టర్ అరుణ వరంగల్ జిల్లా నుంచి బదిలీ పై రూరల్ కు వచ్చింది .ఈ దాడుల్లో ఏసీబీ అధికారు లు పాల్గొన్నారు.



# మే 31 తేదీన ఛలో వరంగల్

- మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకడానికి సిద్ధం కండి
- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోల్ల నరసింహ మాదిగ




**షాద్ నగర్ మే 27(ప్రజాక్షేత్రం):** ఎమ్మార్పీఎస్ అన్ని విభాగాల కార్యకర్తల ఆధ్వర్యంలో చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం షాద్ నగర్ దేవిగ్రాండ్ మీటింగ్ హాల్లో ఎమ్మార్పీఎస్ ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు నాగభూషణ్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ పాల్గొని మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల నుండి జాతి కోసం ఉద్యమ పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగినది ఎమ్మార్పీఎస్ దండోరా ఉద్యమంలో సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తించి. ఈనెల 27వ తేదీ న ఢిల్లీలో మందకృష్ణ మాదిగ అత్యున్నత అవార్డు పద్మశ్రీ పురస్కారాన్ని అందుకొని 31వ తేదీన వరంగల్ కు చేరుకుంటారు. కావున యావత్ మాదిగ జాతి మొత్తం జాతి మహాత్ముడైన పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలుకుదాం ర్యాలీ విజయవంతం చేయడానికి రంగారెడ్డి జిల్లా లోని నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుండి వాహనలా జన సమీకరణతో 31 తేదీన చలో వరంగల్ కు ప్రతి గ్రామం మండలం, నియోజకవర్గాల, గ్రామాల నుండి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ కి వచ్చే ప్రతి ఒక్కరూ డ్రెస్ కోడ్ ధరించుకొని రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు నాగభూషణం మాదిగ, కల్లేపల్లి బాలరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు చెన్నగల్ల శ్రావణ్ కుమార్ మాదిగ, సీనియర్ నాయకులు, గుడెపు ప్రవీణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు, చెదురువల్లి లింగం మాదిగ, రాయికల్ వెంకటేశ్ మాదిగ, దేషరథ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ క్యాంప్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

**సిరిసిల్ల మే 27(ప్రజాక్షేత్రం):** బీఆర్ఎస్ వర్కంగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు చెందిన సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సోమవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టేందుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించడం ఉద్రిక్తతలకు దారి తీసింది. కాంగ్రెస్ నాయకుల ప్రయత్నాన్ని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. రేవంత్ ఫోటో పెట్టకుండా కాంగ్రెస్ నాయకులను అడ్డుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలను డీసీఎం వాహనాల్లో పోలీసులు స్టేషన్ కు తరలించారు. పోలీసుల లాఠీ ఛార్జిలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి సహా పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసుల వైఖరిపై బీఅర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. అధికార పార్టీ వారికి అనుకూలంగా వ్యవహరించి వారి దౌర్జన్యాన్ని అడ్డుకోచూసిన మాపై లాఠిచార్జీ చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.






## వర్షా కాలంలో పిడుగుల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలని సాంస్కృతిక సారథి ప్రభుత్వ కళాకారుల ఆట పాట మాట

**జిల్లా ప్రజలను నుండి విశేష ఆదరణ పొందుతున్న ప్రభుత్వ సాంస్కృతిక సారథి కళాకారులు**

**ఇటిక్యాల,మే 26(ప్రజాక్షేత్రం):**

సోమవారం రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్పర్సన్ వెన్నెల,గద్దర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్,జిల్లా డిపిఆర్ఓ సారథ్యంలో జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు ఇటిక్యాల మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో ప్రస్తుత వానకాలం కావున భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,పశువులను పొలాల దగ్గర చెట్ల కింద ఉంచకుండా సురక్షితమైన ప్రదేశాలకు చేర్చి మనం సాదుకున్న జంతువులను కూడా కాపాడుకోవాలని,వర్షాల కురుస్తున్న సమయంలో చెట్ల కింద ఉండకుండా పిడుగుల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని పాటల రూపంలో డప్పు కొడుతూ... ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు రమాదేవి,కేశవులు,భూపతి నాయుడు,హజరత్, స్వామి,కవిత,కృష్ణ,ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ సమీపంలో మహిళ దారుణ హత్య

**రాజన్న జిల్లా మే 26(ప్రజాక్షేత్రం):**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కేంద్రంలోని పోలీస్ స్టేషన్ అతి సమీపంలో మల్లవ్వ అనే మహిళను ఈరోజు అతి కిరాతకంగా హత్య చేశారు. చందుర్తి మండలానికి చెందిన బొల్లు మల్లవ్వ,(60)అనే మహిళ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ప్రధాన రహదారి పై అతి కిరాతకంగా హత్య చేశారు. అనంతరం నిందితుడు పోలీస్ స్టేషన్లో లొంగిపోయి నట్టు తెలిసింది, భూ తగాదాలే ఈ హత్యకు కారణమని స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించిన మరింత సమాచారం తెలియవలసి ఉంది.



# నకిలీ విత్తనాలు అమ్మకుండా పొగడ్బంతి చర్యలు తీసుకోవాలి

**టాస్క్ ఫోర్స్ కమిటీలకు కలెక్టర్ ఆదేశం**



**వనపర్తి ప్రతినిధి ఏప్రిల్ 26(ప్రజాక్షేత్రం):**

జిల్లాలో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి టాస్క్ ఫోర్స్ కమిటీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లా స్థాయి సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభవుతున్నందున రైతులు విత్తనాలు నాటేందుకు సమాయత్తం అవుతుంటారని, పొరపాటున నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అందువల్ల జిల్లాలో ఎక్కడ నకిలీ విత్తనాలు, ప్యాకింగ్ చేయని, లేబుల్ లేని విత్తనాలు అమ్మడానికి వీలు లేదని హెచ్చరించారు. టాస్క్ ఫోర్స్ అధికారులు జిల్లాలోని అన్ని విత్తనాలు అమ్మే షాపులు, డీలర్ షాపులను తనిఖీ చేసి ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఉంటే కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పత్తి విత్తనాలు చాలా ఖరీదైనవి ఉండటం వల్ల నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్ లో గాని రైతులకు బ్రోకర్ల ద్వారా అమ్మే ప్రమాదం ఉందన్నారు. హ్యాషన్ హౌస్ ఆఫీసర్, మండల వ్యవసాయ అధికారులతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి, మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు డీలర్ షాపులను తనిఖీ చేసి సీడ్ ప్యాకెట్ లను తనిఖీ చేయాలని, ప్యాకెట్ పై జి.ఈ.ఎ.సి రిజిస్ట్రేషన్ నెంబర్ ఉండాలని జి. ఈ. ఎ.సి నెంబర్ లేకున్నా, లూజ్ విత్తనాలు అమ్మకానికి పెట్టిన వెంటనే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. లైసెన్స్ కలిగిన డీలర్లు మాత్రమే విత్తనాలు అమ్మాలని ఇతరులు విత్తనాలు అమ్మడానికి వీలు లేదన్నారు. లైసెన్స్ లేని వారు విత్తనాలు అమ్మినా, నకిలీ విత్తనాలు అమ్మినా సీడ్ యాక్టు 1966, సీడ్ కంట్రోల్ ఆర్డర్ 1983, ఈ. పి యాక్టు 1986 ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రైతులు వరి పంట మాత్రమే కాకుండా ఇతర వాణిజ్య పంటల సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వరి సాగు చేసే రైతులు దొడ్డు రకం కాకుండా సన్న రకం మాత్రమే సాగు చెస్ విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు నకిలీ విత్తనాల పై అవగాహన కల్పించడమే కాకుండా పంట రైతులకు పంట మార్పిడి పై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర రావు, ఏ.డి. ఎ చంద్రశేఖర్, మున్నా, సి. ఐ లు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# కేశవరావును సజీవంగా పట్టుకుని తర్వాత కాల్చి చంపారు



**హైదరాబాద్ మే 26(ప్రజాక్షేత్రం):**

మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతిపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. నంబాల కేశవరావను పట్టుకుని తర్వాత భద్రతా దళాలు కాల్చి చంపారని తెలిపారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ నుంచి లేఖను విడుదుల చేశారు. లొంగిపోయిన మావోయిస్టులు అందించిన సమాచారం తోనే భద్రతాదళాలు అక్కడ కూంబింగ్ జరిపాయన్నారు. మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప పేరిట మావోయిస్టులు సోమవారం లేఖ విడుదల చేశారు. తమ నాయకుడిని కాపాడుకోవడంలో తాము విఫలమయ్యామని తెలిపారు. కేశవరావు టీంలో ఉన్న ఆరుగురు సభ్యులు ఇటీవల ప్రభుత్వానికి లొంగిపోయారని వారు ఇచ్చిన సమాచారంతోనే ఇంతటి దారుణం జరిగిందని తెలిపార. ఎన్ కౌంటర్ ముందు రోజు నుంచి ఇరవై వేలమంది భద్రతాబలగాలు తమ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని, పది గంటల్లో ఐదు ఎన్ కౌంటర్లు జరిగాయని తెలిపారు. కేశవరావు 6 నెలలుగా మాడ్ ప్రాంతంలో ఉన్నట్లు నిఘా వర్గాలకు తెలుసన్నారు. కేశవరావు టీమ్‌లో ఉన్న ఆరు గురు మావోయిస్టులు ఇటీవల పోలీసులకు లొంగిపోయారని, ఆ ద్రోహుల ఇచ్చిన సమాచారంతోనే ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు. నంబాల భద్రతలో ప్రధాన పాత్ర పోషిస్తోన్న సివైపిసి సభ్యులు కూడా ద్రోహానికి పాల్పడ్డ వారిలో ఉన్నారు. మాడ్ ఉద్యమానికి నాయకత్వం వహించిన యూనిఫైడ్ కమాండ్ సభ్యుడు కూడా దేశ ద్రోహిగా మారాడు. దీంతో భద్రతా దళాల పని సులువైంది. రీకితో సహా ఈ దేశ ద్రోహులందరూ కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. నారాయణపూర్ జిల్లా మాడ్ ప్రాంతంలోని గుండెకోట్ అడవిలో 2026, మే 21 జరిగిన ఎన్ కౌంటర్లో నంబాల మృతి చెందారని ధృవీకరించారు. ఆయనతో పాటు మరో 28 మంది మావోయిస్టులు మరణించారని వెల్లడించారు. ఈ మేరకు ఈ ద్రోహుల కారణంగానే మనం ఇంత పెద్ద నష్టాన్ని చవి చూడాల్సి వచ్చింది. మే 19న నంబాల ఉన్న సమీప గ్రామానికి పోలీసు బృందం చేరుకుందని సమాచారం అందిన తర్వా త ఆ ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి బయలుదేరాం. 19వ తేదీ ఉదయం నుంచి ఐదు ఎన్‌కౌంటర్‌లు జరిగాయి కానీ ఎటువంటి నష్టం జరగ లేదు. మే 20 రాత్రి వేలాది మంది పోలీసు బలగాలు వారిని చుట్టుముట్టాయి. 60 గంటల పాటు భద్రత దళాలు తమను నిర్బంధించాయి. కేశవ రావును సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించాం. కానీ మమ్మల్ని వదిలి బయటకు వెళ్లేందుకు ఆయన ఇష్టపడలేదు. ముందుండి మమ్మల్ని నడిపించారు. కేశవరావుని కాపాడుకునేందుకు 35 మంది ప్రాణాలు అడ్డుపెట్టారు. కానీ మే 21న జరిగిన ఆపరేషన్‌లో నంబాలతో పాటు 28 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు సురక్షితంగా బయటపడ్డాం'మని సదరు లేఖలో పేర్కొన్నారు. కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించిందని, అయితే, మరో మృత దేహాన్ని తాము తీసుకెళ్లామని లేఖలో వెల్ల డించారు. పాక్ తో శాంతి చర్చలకు సిద్ధమైన భారత ప్రభుత్వం తమతో మాత్రం చర్చలకు సిద్ధం కాలేదని మావోయిస్టులు లేఖలో పర్కన్నారు. తాము కాల్పుల విరమణను పాటించినా భద్రతాదళాలు మాత్రం దానిని పాటిచంలేదని తెలిపారు.



# మే 31న ఛలో వరంగల్

- **ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేద్దాం..**
- **ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ..**

**తాండూర్ మే 27(ప్రజాక్షేత్రం):**సోమవారం తాండూర్ నియోజకవర్గ ఎంఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ వచ్చే నెల విద్యా సంస్థలు ప్రారంభం కానున్నాయి కావున విద్యార్థుల సమస్యలకోసం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల కోసం ముందుండి పోరాడాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ అన్ని వర్గాలకోసం పోరాటం చేసిన విషయాలని వారికి గుర్తు చేశారు అందువల్లనే సామాజినికి అనేక సంక్షేమ పథకాలు సాధించి పెట్టమని అన్నారు. అట్లాగే ఈ నెల 31న వరంగల్ లో జరిగే ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి మరియు అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయటానికి వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల ప్రధాన నాయకత్వం సిద్ధపడాలని కోరారు. సామాజిక న్యాయమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకోసం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు మరియు ఉప కులాలు 30సం" రాలు అలుపెరుగని పోరాటం చేశారని ఆ పోరాటానికి సమాజం మద్దతు చాలా ఉందని అందుకే విజయాన్ని సాధించినమని ఆనందం వ్యక్తం చేశారు. అట్లాగే బీజేపీ పెద్దలకి మరోసారి మల్లికార్జున్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎం ఎస్ పి నీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా కో కన్వీనర్ జానీ మాదిగ, తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ పరుశురాం మాదిగ, ఎం ఎస్ ఎఫ్ పెద్దేముల్ మండల కన్వీనర్ ఉమ శంకర్ మాదిగ, తాండూర్ మండల కన్వీనర్ బాలు మాదిగ, ఎమ్మార్పీఎస్ తాండూర్ మండల అధ్యక్షుడు జగదీష్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ నాయకులు అరవింద్ మాదిగ, రాకేష్ మాదిగ, ప్రవీణ్ మాదిగ,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రౌడీ షీటర్ల తాట తీసిన పోలీసులు!

**గుంటూరు జిల్లా,మే 26(ప్రజాక్షేత్రం):**గుంటూరు జిల్లా తెనాలి పోలీసులు రౌడీ షీటర్లకు పోలీస్ లు నడిరోడ్డుపై రాచ మర్యాదలు చేశారు. ఏకంగా నడి రోడ్డుపైనే లాఠీ జులిపించారు. ఇటీవల కాలంలో పట్టణం లో రౌడీ షీటర్ల ఆగడాలు అధికం కావడంతో పాటు గంజాయి మత్తులో పోలీస్ కానిస్టేబుల్ పై దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న తెనాలి పోలీసులు రౌడీ షీటర్లు విక్టర్, బాబూలాల్, రాకేష్లను పట్టుకొచ్చి ఐతనగర్ లోని నడిరోడ్డు పై కూర్చొబెట్టారు. ఓ పోలీస్ నిందితుల కాళ్లపై కాలు పెట్టి అదిమి పట్టు కోగా మరొకరు లాఠీతో నిందితుల పాదాలపై వాచిపోయోలా కోటింగ్ ఇచ్చి తాట తీశారు. పోలీస్ దెబ్బలకు తాళలేక నిందితులు కుయ్యో,మొర్రో, వామ్మో,అంటూ కేకలు, ఆర్తనాదాలు పెట్టారు. పోలీసుల చర్యను కొందరు సమర్థిస్తుండగా..మరికొందరు వారు చట్టాన్నిఅతి క్రమించి కొట్టారని.. అలాంట ప్పుడు న్యాయస్థానాలు ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒక వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష, జరిమానా

**సిద్దిపేట అర్బన్ మే 26(ప్రజాక్షేత్రం):**

సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 16 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి 16 మందికి కలసి రూ. 29,500/వేల రూపాయల జరిమాన విధించారు. ఒక వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష విధించారు. 2 రోజుల జైలు శిక్ష పడిన అతని వివరాలు..గోకురు రాజు తండ్రి నారాయణ, గ్రామం గోపులాపురం, మండలం చిన్నకోడూరు. ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని
# రోడ్డెక్కిన రైతులు

**రంగారెడ్డి జిల్లా, మే 26(ప్రజాక్షేత్రం):**

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎదుట సోమవారం రైతులు, బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నాకు దిగారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యంతో కొనుగోల ప్రక్రియ మందకొడిగా సాగుతోందదని ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ శ్రీశైలంహైదరాబాద్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో మార్కెట్ కి తీసుకువచ్చిన ధాన్యాన్ని నెలలకొద్దీ కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుతున్నాయని, వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్నా వారిని పట్టించుకోవడం లేదంటూ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నేనావత్ పత్య నాయక్ ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు సిఐ జానకిరామ్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేష్, సీతారాం రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. ఒకానొక విషయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్య నాయక్, పార్టీ శ్రేణులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల ధర్నా నేపథ్యంలో శ్రీశైలం=హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పత్యా నాయక్‌ను కల్వకుర్తి మాజీ ఎంఎల్ఎ జైపాల్ యాదవ్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, బిఆర్ఎస్ కడ్తాల్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్, మాజీ ఎంపిటిసి సరిత పంతు నాయక్, మాజీ సర్పంచ్ సోనా శీను నాయక్ తదితరులు పరామర్శించారు.



# దేశానికి అవసరమైన మార్పు వన్ నేషన్-వన్ ఎలక్షన్: పవన్



**చెన్నై మే 26(ప్రజాక్షేత్రం):**

ప్రధాన మంత్రి నరేంద్ర మెడీ నాయకత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎపి డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. దేశాన్ని ముందుకు తీసుకువెళ్లే నాయకుడు ప్రధాని మోడీ అని ప్రశంసలు కురిపించారు. సోమవారం చెన్నైలో 'వన్ నేషన్‌వన్ ఎలక్షన్' సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వన్ నేషన్‌వన్ ఎలక్షన్' దేశానికి అవసరమైన మార్పు అని చెప్పారు. మనసు ఉంటే మార్గం ఉంటుందని.. ముందు ప్రారంభిస్తే.. తర్వాత వచ్చే అడ్డంకులు అధిగమించొచ్చని చెప్పారు. సమస్యలు లేవని తాను చెప్పనని.. కానీ వాటిని అధిగమించగలమని, భారత్‌కు ఉన్న సామర్థ్యంతో 'వన్ నేషన్‌వన్ ఎలక్షన్' ఆచరణ సాధ్యమేనని పవన్ అన్నారు.

# గజ్వేల్ ఏసిపి గా పదవీ బాధ్యతలు చేపట్టిన నర్సింలు



**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి మే 26(ప్రజాక్షేత్రం):** గజ్వేల్ డివిజన్ నూతన ఏసిపి గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. నర్సింలు, సోమవారం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఐపీఎస్ నీ కలసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అభినందించి గజ్వేల్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని సూచించారు. మరియు గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాల జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మత్తు పదార్థాల రహిత జిల్లాగా ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలని దొంగతనాలు జరగకుండా విజబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని తెలిపారు.ఎసిపి కే నర్సింలు వివరాలు: ఇంతకుముందు 1995 బ్యాచ్, ఎస్ఐగా ఉమ్మడి మహబూబ్ నగర్, జిల్లాలో పనిచేయడం జరిగింది. సీఐగా సైబరాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలలో పనిచేయడం జరిగింది. ఏసీపీగా ప్రమోషన్ పొంది అచ్చంపేట, వికారాబాద్, హైదరాబాద్ ఇంటలిజెన్స్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ హైదరాబాద్ పనిచేస్తూ బదిలీపై గజ్వేల్ ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు అని తెలిపారు.

# కడియం శ్రీహరి, కావ్య బీజేపీలోకి వెళ్లడం ఖాయం: తాటికొండ రాజయ్య

- **కడియం శ్రీహరి, కావ్య బీజేపీలో చేరడం ఖాయమన్న రాజయ్య**
- **కేంద్రమంత్రి పదవి కోసమే ఈ అడుగులని ఆరోపణ**
- **కాంగ్రెస్‌ను శ్రీహరి మోసం చేస్తారన్న మాజీ ఎమ్మెల్యే**
- **గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్‌లకు ద్రోహం చేశారని విమర్శ**
- **అభివృద్ధిపై శ్రీహరివి కల్లబొల్లి మాటలని రాజయ్య వ్యాఖ్య**

**స్టేషన్ ఘనపూర్ మే 26(ప్రజాక్షేత్రం):**కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలో చేరడం ఖాయమని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర మంత్రి పదవి దక్కుతుందనే ఆశతోనే శ్రీహరి ఈ నిర్ణయం తీసుకుంటారని ఆయన జోస్యం చెప్పారు. లింగాల గణపురంలో సోమవారం ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో రాజయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, "పదవి వస్తుందంటే చాలు, వెన్నుపోటు పొడిచే అలవాటు కడియం శ్రీహరికి ఉంది. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో ఆయన, తన కుమార్తె కావ్యతో కలిసి కాంగ్రెస్‌ను మోసం చేసి బీజేపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయం" అని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు రాష్ట్రానికి అప్పులు కూడా పుట్టడం లేదని, కేంద్రం తనను చెప్పులు ఎత్తుకెళ్లే దొంగలా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తుంటే, మరోవైపు కడియం శ్రీహరి మాత్రం నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నానని అబద్ధపు ప్రచారాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. "రాజకీయంగా భవిష్యత్తునిచ్చిన ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు పంచన చేరారు. ఆ సమయంలో ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించిన వారిలో కడియం కూడా ఒకరు" అని ఆరోపించారు. ఆ తర్వాత, మంత్రి పదవులు ఇచ్చిన చంద్రబాబుకు కూడా ద్రోహం చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ ఆయనకు ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఉప ముఖ్యమంత్రిగా అవకాశాలు కల్పించారని, ఆయన కుమార్తె కావ్యకు ఎంపీ టికెట్ కూడా ఇచ్చారని రాజయ్య గుర్తు చేశారు. "అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి రూ. 200 కోట్లకు అమ్ముడుపోయి కేసీఆర్‌కు కడియం ద్రోహం చేశారు" అని రాజయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మార్చడం, నమ్మినవారిని మోసం చేయడం కడియం శ్రీహరికి వెన్నతో పెట్టిన విద్య అని ఆయన దుయ్యబట్టారు.



# నేను ఆస్తి అడిగానా..?



తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మంచు ఫ్యామిలీలో కొద్ది నెలల క్రితం నుంచి విభేదాలు బయట పడుతున్నాయి. మోహన్ బాబు కొడుకులుమంచు విష్ణు, మంచు మనోజ్ మధ్య మనస్పర్ధలు తలెత్తడం అవి పెరిగి పెరిగి దాడులు, కేసులు, కోర్టులు వరకు వెళ్లడం తెలిసిందే. మంచు విష్ణు ,మోహన్ బాబు ఒకవైపు నిలబడగా మనోజ్ ఒక్కడే మరోపక్క నిలబడి ఫైట్ చేస్తున్నాడు. అయితే ఈ క్రమంలోనే ఆస్తి విషయంలోనే మంచు ఫ్యామిలీలో గొడవలు వచ్చాయని గతంలో ప్రచారం జరిగింది. ఈ విషయంపై తాజాగా మంచు మనోజ్ నోరు విప్పాడు. నేను ఆస్తి అడిగానా..? దమ్ముంటే అడిగినట్లు నిరూపించండి అంటూ మనోజ్ సవాల్ విసిరాడు. ఇంతవరకు తాను ఆస్తి అడగలేదని చెప్పారు. నింద వేసి వాటిని నిజమని అంగీకరించమంటే తన వల్ల కాదని ఆవేదనకు లోనయ్యాడు. సమస్యలను కూర్చొని మాట్లాడుకుందామని, గొడవలు వద్దని తాను అంటున్నా అని తన అభిప్రాయం చెప్పారు. ఇక తన భార్య మౌనిక జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొందని, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిందని చెప్పారు. అలాంటి బాధ ఎవరికీ రాకూడదని అన్నారు. ఈ గొడవలతో ఆమెకు ఏమాత్రం సంబంధం లేదని చెప్పుకొచ్చారు.



## పవన్ మాటలపై అల్లు అరవింద్ రియాక్షన్

థియేటర్స్ బంద్ విషయంలో మొదలైన వివాదం రోజుకొక కొత్త మలుపు తీసుకుని ముందుకు వెళుతోంది. తాజాగా ఈ వివాదం వెనుక అల్లు అరవింద్ హస్తం ఉందని, ఇది పవన్ కళ్యాణ్‌పై రివెంజ్‌గా జరిగిన కుట్ర అని కొందరు భావిస్తున్నారు. అల్లు అరవింద్ తన కొడుకు అల్లు అర్జున్‌పై పవన్ చేసిన వ్యాఖ్యలకు కోపంతో పవన్ సినిమా రిలీజ్‌ను అడ్డుకునేందుకు థియేటర్ యజమానులతో ఒప్పందాలు చేసుకున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన సినిమా విడుదలకు ముందు ఇబ్బందులు సృష్టించడంతో పవన్ నేరుగా రంగంలోకి దిగారు. ఘాటుగా లేఖ రాశారు. ఈ క్రమంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ ప్రెస్ మీట్ పెట్టారు.''ఇప్పుడు ప్రతిచోటా ఆ నలుగురు ఆ నలుగురు అంటున్నారు. నేను ఆ నలుగురిలో లేను. ఆ వ్యాపారం నుంచి బయటకు వచ్చేశా. తెలంగాణాలో నాకు ఒక్క థియేటర్ కూడా లేదు. 'ఏఏఏ' (అమీర్‌పేట్‌లోని అల్లు అర్జున్ ఏషియన్ మల్టీప్లెక్స్) తప్ప. రెండు తెలుగు రాష్ట్రాల్లో 1500 థియేటర్లు ఉంటే నాకు పదిహేను కూడా లేవు. త్వరలో ఆ థియేటర్స్ కూడా నా దగ్గర ఉండవు అని అల్లు అరవింద్ తెలిపారు. ఆ నలుగురిలో తనను కలపవద్దని మీడియాకు రిక్వెస్ట్ చేశారు. దీంతో ఇప్పుడు బాల్ మిగతా డిస్ట్రిబ్యూటర్స్ కోర్టులో పడిందని చెప్పవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో మెజారిటీ థియేటర్లు 'దిల్' రాజు, సురేష్‌బాబు దగ్గర ఉన్నాయి. అల్లు అరవింద్ ప్రెస్ మీట్ నేపథ్యంలో వాళ్ళు ఎలా స్పందిస్తారు? అనేది ఆసక్తిగా మారింది.

## నటి ప్రీతి జింటా మంచి మనసు

బాలీవుడ్ హీరోయిన్ అయినప్పటికి తెలుగులో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్‌లలో ప్రీతి జింతా ఒకరు. ఈ అమ్మడు హిందీతో పాటు తెలుగులోను పలువురు సీనియర్ హీరోలతో కలిసి సందడి చేసింది. ప్రజంట్ సినిమాలు కాస్త తగ్గించిన ఈ భామ బిజినెస్‌లతో బిజీ అయింది. అలాగే ఇప్పుడు పంజాబ్ కింగ్స్ సహ యజమాని అయిన ప్రీతి జింతా ఐపీఎల్‌లో హుషారుగా పాల్గొంటుంది. తన జట్టు మ్యాచులు ఉంటే చాలు మైదానంలో ఆమె హడావుడి మాములుగా ఉండదు. ఇక తాజాగా ప్రీతి జింతా సైనిక కుటుంబాల పట్ల తన బాధ్యతను చాటుకొని అందరి మనసులు గెలుచుకుంది. సౌత్ వెస్ట్రన్ కమాండ్‌లోని సైనిక వితంతువుల సంక్షేమ నిధికి రూ. 1.10 కోట్ల విరాళం ఇచ్చింది ఈ అమ్మడు. వీర నారీమణుల సాధికారితకు, వారి పిల్లల చదువు కోసం ఈ మొత్తాన్ని వెచ్చించనున్నారు. అయితే ఈ విషయమై ప్రీతి జింటా మాట్లాడుతూ "మన సాయుధ దళాల ధైర్యవంతులైన కుటుంబాలకు ఎంతో కొంత సాయం చేయడం అనేది గౌరవం, బాధ్యత. మన సైనికులు చేసిన త్యాగాలను నిజంగా తిరిగి చెల్లించలేం. కానీ మనం వారి కుటుంబాలకు అండగా నిలిచి, వారిని ముందుకు సాగడానికి మద్దతు ఇవ్వగలం. భారతదేశ సాయుధ దళాల పట్ల మేము అపారమైన గర్వాన్ని కలిగి ఉన్నాం. మన దేశం, మన ధైర్యవంతులైన దళాలకు మద్దతుగా నిలబడతాం" అని ప్రీతి జింటా అన్నారు.





# బలగం నటుడు మృతి

ప్రముఖ రంగ స్థల కళాకారుడు, బలగం సినిమా నటుడు జీవీ బాబు కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే వరంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన వయస్సు 65 సంవత్సరాలు. ఆయన మృతి చెందడంతో ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. జీవీ బాబు తెలుగు నాటక రంగానికి తన నిబద్ధతతో, నటనా ప్రతిభతో ఎంతో కృషి చేశారు. గ్రామీణ నాటకాల నుంచి సాంఘిక ప్రసంగాల వరకు ఎన్నో పాత్రలకు ప్రాణం పోశారు. రెండేళ్ల క్రితం విడుదలైన 'బలగం' సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రియదర్శికి చిన్నతాత అంజన్నగా జీవీ బాబు అద్భుతంగా నటించారు. జీవీ బాబు మృతి గురించి తెలుసుకున్న సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. జీవీ బాబు మరణంపై బలగం డైరెక్టర్ వేణు విచారం వ్యక్తం చేశారు. జీవీ బాబు జీవితం మొత్తం నాటక రంగంలోనే గడిపారని, చివరి రోజుల్లో ఆయన్ని బలగం ద్వారా పరిచయం చేసే భాగ్యం తనకు దక్కిందని చెప్పారు. అయన ఆత్మ శాంతించాలి అని కోరుకుంటున్నానని ట్వీట్ చేశారు.



ప్రభాస్‌కి జోడిగా

# బోల్డ్ బ్యూటీ

ప్రభాస్ లైనప్‌లో ఎన్ని సినిమాలున్నా స్పిరిట్ పైనే ఫ్యాన్స్ కళ్లన్ని. అసలు స్పిరిట్ సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న ఎక్స్‌పెక్టేషన్ అన్నీ ఇన్నీ కావు. ఇంకా షూటింగ్ కూడా స్టార్ట్ కాలేవు కానీ.. అప్పుడు స్పిరిట్ గురించి ఓ రేంజ్‌లో చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సందీప్ రెడ్డి దర్శకత్వం వహించనుడంతో ఏ రేంజ్‌లో సినిమా ఉండబోతుందా అనే టాక్ వినిపిస్తోంది. స్పిరిట్ అనేది ఇప్పుడు సింపుల్ వర్డ్‌లా అనిపిస్తుంది కానీ ఒక్క సారి సినిమా స్టార్ట్ అయ్యాక టైటిల్‌కు జస్టిఫికేషన్ అనిపిస్తుందని సందీప్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ఆల్రెడీ ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా సందీప్ స్టార్ట్ చేసినట్లు సమాచారం. అందులో ముఖ్యంగా ఈ సినిమా క్యాస్టింగ్ గురించి తెగ చర్చలు జరుగుతున్నాయి. మరి ముఖ్యంగా హీరోయిన్ రోల్‌పై చర్చలు మాములుగా జరగడం లేదు. ఈ సినిమాలో ప్రభాస్‌కు జోడీగా రోజుకో పేరు వినిపిస్తుంది. ముందు రష్మిక, కత్రినా కైఫ్‌ల పేర్లు వినిపించినా మేకర్స్ దాదాపుగా దీపిక పదుకొనేను ఫైనల్ చేశారు. అయితే స్పిరిట్ మేకర్స్‌తో క్రియేటీవ్ డిఫరెన్సెస్ రావడంతో, దీపికా పదుకొనే తప్పుకుందట. అయితే తాజాగా మేకర్స్ హీరోయిన్‌ను ఫిక్స్ చేశారు. యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీని ఫైనల్ చేశారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను మేకర్స్ ప్రకటించారు. ఇక రెండేళ్ల కిందట రిలీజైన యానిమల్ సినిమాతో త్రిప్తి సృష్టించిన యుఫోరియా అంతా ఇంతా కాదు. నిజానికి ఈ సినిమాలో కనిపించింది కాసేపే అయినా ఈ బ్యూటీ చూపించిన ఇంపాక్ట్ అంతా ఇంతా కాదు దెబ్బకు నేషనల్ స్టార్ అయిపోయింది.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR.
Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330